# ఎన్నికల విధులకు డుమ్మా కొడితే కఠిన చర్యలు

**జనరల్ అబ్జర్వర్ ప్రశాంత్ జీవన్ పాటిల్**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, డిసెంబరు 5 ప్రభాతవార్త :** ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా శుక్రవారం పోలింగ్ సిబ్బంది రెండవ విడత ర్యాండమైజెషన్ ప్రక్రియను జనరల్ అబ్జర్వర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ మరియు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సమక్షంలో పూర్తి చేశారు. శుక్రవారం జనరల్ అబ్జర్వర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ మరియు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణ రెడ్డి నేతృత్వంలో జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ రెండవ విడత ర్యాండమైజెషన్ ప్రక్రియను నిర్వహించారు. జిల్లాలో నిర్వహించే గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి మండలాల వారీగా ఎన్నికల విధులు నిర్వర్తించే 4458 ప్రిసైడింగ్, అధికారులను, ఇతర అధికారులతో కూడిన బృందాలను ర్యాండమైజెషన్ ద్వారా కేటాయించారు. వీరికి ఇప్పటికే మొదటి విడత శిక్షణను ఎంపిక చేసిన వివిధ కేంద్రాలలో మాస్టర్ ట్రైనర్స్ చే పోలింగ్ నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగిందని కలెక్టర్ అన్నారు.

రెండవ విడత మండలాలలో పోలింగ్ సిబ్బందికి కేటాయించిన మండల కేంద్రాలలో రెండవ శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని, ఎవరైనా ఎన్నికల విధులకు గైర్హాజరు అయినట్లయితే ఎన్నికల నిబంధనలను అనుసరించి కఠిన చర్యలు తీసుకోబడుతాయని అని కలెక్టర్ హెచ్చరించారు. ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియలో జిల్లా అదనపు కలెక్టర్ డీపీఓ సురేష్ మోహన్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జనరల్ అబ్జర్వర్ ప్రశాంత్ జీవన్ పాటిల్



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త




# గుర్తుండేలా..

**ఎన్నికల ప్రచారంలో నయా ట్రెండ్**
**సోషల్ మీడియా వేదికగా ఎన్నికల గుర్తులు చక్కర్లు**
**మేనిఫేస్టోల మెసేజ్‌లు**
**గ్రామాల్లో వెలుస్తున్న పోస్టర్లు**

**రంగారెడ్డి, డిసెంబరు 5, ప్రభాతవార్త :** జిల్లాలో మొదటి విడతలో 174 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరుగుతున్నాయి. పోరు పల్లెస్థాయిలోనే అయినా ప్రచారం మాత్రం సామాజక మాధ్యమాల్లో హోరెత్తుతోంది. సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు వాట్సాప్ గ్రూపుల్లో హామీలతో పాటు గుర్తులతో క్యాంపెయిన్ చేసుకుంటున్నారు. తొలి విడత బరిలో 846 మంది సర్పంచ్ అభ్యర్థులు, 4,123 మంది వార్డు సభ్యులు పోటీ పడుతున్నారు. తొలి విడత ఎన్నికలు జరిగే షాద్‌నగర్ నియోజకవర్గం లోని కేశంపేట్, కొందుర్గు, కొత్తురు, జిలేడుచౌదరిగూడెం, ఫారుఖ్‌నగర్, నందిగామ, శంషాబాద్ మండలాల్లో అభ్యర్థులు ప్రచారం పైదృష్టి సారించారు. కరపత్రాలు, వాల్‌పోస్టర్ల ద్వారా ప్రచార సామాగ్రిని సిద్ధం చేసుకుంటున్నారు. కొందరు తమకు కేటాయించిన గుర్తులతో పాటు తమ ఫొటోలు ఉండే విధంగా బ్యానర్లు ఏర్పాటు చేస్తున్నారు..

పంచాయతీ అభ్యర్థులు సోషల్ మీడియాల్లో తమకు కేటాయించిన గుర్తులతో పాటు ఎన్నికల్లో తమను గెలిపిస్తే చేసే పనులకు సబంధించి మేనిఫెస్టోలను వాట్సాప్‌లలో చక్కర్లు కొట్టిస్తున్నారు. ఆయా గ్రామాల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసుకుంటున్న వాట్సాప్ గ్రూప్‌లను ఇందుకు వేదికగా చేసుకుంటున్నారు. కొందరు సోషల్ మీడియాలో రీల్స్ సైతం చేస్తూ ఆకట్టుకుంటునే ప్రయత్నం చేస్తున్నారు. మరో నాలుగు రోజులు మాత్రమే సమయం ఉండడంతో ఊర్లలో ఉన్న తమ బంధుగణంతో పాటు స్నేహితులతో గెలుపు మంతనాలు చేస్తున్నారు. కులాలు, యూత్ అసోసియేషన్ల వారీగా హామీలు ఇస్తూ సర్పంచ్ పీఠంతో పాటు వార్డు స్థానాలు గెలుచు కునేందుకు యత్నిస్తున్నారు. పంచాయతీ ఎన్నికల సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు తమకు కేటాయించిన గుర్తులను ప్రచారంలో స్పెషల్ ఫోకస్ చేయడంపై దృష్టి సారించారు. ఉంగరం, కత్తెర, బ్యాట్, ఫుట్బాల్, లేడీపర్సు, టూత్ పేస్టు, చెత్తడబ్బా, నల్లబోర్డు, బెండకాయ్, టీవీ రిమోట్, కొబ్బరి తోట, వజ్రం, బకెట్, డోర్ హ్యాండిల్, టీ జల్లెడ, మంచం, టేబుల్, బ్యాటరీ లైట్, బిస్కట్, వేణువు,

మిగతా 2లో

# మర్యాద రామన్నలు

**ఎన్నికల వేళ పంచాయతీ అభ్యర్థుల ఔదార్యం**
**ప్రచార కార్యకర్తలకు సకల మర్యాదలు**
**ఉదయం నుంచి రాత్రి వరకూ మందు..విందు**
**రోజుకు రూ.300 చొప్పున నగదు పారితోషికం**
**ఓటర్ల ఇంటికి బీరు నుంచి కూల్ డ్రింక్స్ వరకూ..**
**వెజ్ నుంచి నాన్ వెజ్ వరకూ ..**
**నిత్యావసర వస్తువుల పంపిణీ**
**అటకెక్కుతున్న ఎన్నికల సంఘం ఆంక్షలు**





ఎన్నికల ప్రచార కార్యకర్తలకు బహిరంగ ప్రదేశంలో భోజన ఏర్పాట్ల దృశ్యం

**నందిగామ, డిసెంబరు 5 ప్రభాతవార్త :** ఎన్నికలు అంటే అలాంటి ఇలాంటి హంగామా కాదు.. ఎన్ని కలలో నిజం చేసుకోవాల్సిన తరుణం. ఐదేళ్లకు వచ్చే అవకాశం.. ఎలా గెలిచామన్నది కాదు.. గెలిచామా లేదా అన్నదే ఫైనల్. అందుకోసం ఏమైనా చేయాలి తప్పదు... ఇదీ ప్రస్తుతం పలువురి అభ్యర్థుల మనోగతం. ఎన్నికల సంఘం ఎన్ని నియమావళులు పెట్టినా.. ఎన్ని ఆంక్షలు విధించినా కొన్ని మర్యాదలు అభ్యర్థులకు తప్పవు.. ఏ అభ్యర్థి అయినా తనకు తాను ఏకాకిగా ఎన్నికల బాధ్యతలు చూసుకోలేరు. సహాయకులు ఉండాల్సిందే. ఇక ఓటర్లను ఆకట్టుకోవటానికి హడావుడి చేసే అనుచరగణమూ ఉండాలి. ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించటానికి వెనుక జనం ఉండాల్సిందే. వీరందరికీ పోలింగ్ అయ్యే వరకూ ఏ లోటూ రాకుండా చూసుకుంటేనే మరి. తేడా వస్తే అల్లరల్లరే. ఉదయం రోజుకో వెరైటీతో టిఫిన్, ఆ తర్వాత మందు.. మధ్యాహ్నం విందు.. సాయంత్రం చికెన్, మటన్ బిర్యాని వంటి స్పెషల్స్ అన్నీ ఉండాల్సిందే. ఖర్చు తడిసి మోపుడు అవుతున్నా భరించకతప్పదనుకుంటూ ప్రచార కార్యకర్తలకు అభ్యర్థులు సకల మర్యాదలు చేస్తున్నారు. దీంతో పాటు రోజంతా తమతో ఉన్నందుకు రోజుకు రూ.300 చొప్పున పారితోషికం కూడా సమర్పించుకుంటున్నారు. కొన్ని చోట్ల అయితే ఓటర్ల ఇంటికి వెళ్లి కేజీ చికెన్, మటన్, బీరు, కూల్ డ్రింక్స్, 2 కేజీల మంచి నూనె ప్యాకెట్లు, పప్పులు, చింతపండు వంటి నిత్యవసర వస్తువులను పంపిణీ చేస్తుండటం గమనార్హం. మరికొందరు అభ్యర్థుల ఎనినకల గుర్తులు ఓటర్లకు గుర్తుండిపోయేలా పాటలల్లి కళాకారుల ఆటపాటలతో ధూమ్ దాం చేస్తున్నారు. ఎన్నికల కోలాహలంలో గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది.

# జనమే మనం

**సేవకులుగా పనిచేయండి**

**ఏకగ్రీవ సర్పంచ్‌లకు ఎమ్మెల్యే మనోహర్ దిశానిర్దేశం**



**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** పాలకులుగా కాకుండా సేవకులుగా పని చేస్తూ ప్రజాదరణ పొందాలని తాండూరు శాసనసభ్యుడు బుయ్యని మనోహర్‌రెడ్డి ఉద్బోధించారు. గాంధీజీ కలలుగన్న విధంగా గ్రామసీమలు పురోగతి సాధించాలంటే జనమే మనంగా భావించి ముందుకు సాగాలని సూచించారు. నియోజకవర్గ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఏకగ్రీవంగా ఎన్నికైన 25 మంది సర్పంచ్‌లను, ఉపసర్పంచ్‌లను, వార్డు సభ్యులను శుక్రవారం క్యాంప్ ఆఫీసులో సత్కరించిన ఎమ్మెల్యే పైవ్యాఖ్యలు చేశారు. ఐదేండ్ల పాటు నిజాయితీగా, నిస్వార్థంగా పని చేయాలని స్పష్టం చేశారు. సర్పంచ్‌లు వెళ్లే బాటలో ముళ్లూ, రాళ్లూ ఉంటాయని గుర్తు చేశారు. వాటిని అవలీలగా తొలగించి రాచ బాట నిర్మించుకోవాలని సూచించారు. గ్రామాల అభివృద్ధికి సరిపడా నిధులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. గెలుపొందిన వారికి ఓర్పు, సహనం, సమయస్ఫూర్తి ఉండాలన్నారు. ఎక్కడా భేషజాలకు తావివ్వకూడదని హితవు పలికారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా కావడం వల్ల ప్రత్యేక గ్రాంట్లు, నిధులు వస్తాయని చెప్పారు. కొత్త సర్పంచ్‌లు తమ విధులు, బాధ్యతలపై అవగాహన చేసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో నెలకొన్న సమస్యలను అధ్యయనం చేసి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు చేయాలన్నారు. ఆపదలో ఉన్నవారి భుజం తట్టి అండగా నిలవాలని చెప్పారు. కార్యదర్శులతో సమన్వయంతో ముందకు సాగాలన్నారు. మండల స్థాయి అధికారుల, ఇంజనీరింగ్ విభాగాల అధికారుల సహకారంతో అభివృద్ధి చేపట్టాలని తెలిపారు. ఒంటెద్దు పోకడలు పోకుండా సమిష్టి నిర్ణయాలు తీసుకుంటే గ్రామాలు బాగుపడతాయని ఎమ్మెల్యే మనోహర్ హితోపదేశం చేశారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ధారాసింగ్, మార్కెట్ కమిటీ చైర్మన్లు బాల్‌రెడ్డి, మాధవరెడ్డి, అంజయ్య, సీనియర్ నేతలు మహిపాల్‌రెడ్డి, గోపాల్, ఉప్పరి మల్లేశం, పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, హనుమంతు ముదిరాజ్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ నర్సిరెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తుపాకుల అనిల్‌కుమార్, సర్పంచ్‌లు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మా పల్లెలో గోపాలుడు

**ఏకాభిప్రాయంగా గోపాల్‌రెడ్డికి జై కొట్టిన అయ్యవారిపల్లి**
**జనరల్ స్థానం అయినా పోటీ లేకుండా ఏకగ్రీవం**
**దీర్ఘకాలంగా గ్రామంలో గోపాల్‌రెడ్డి స్వచ్ఛంద సేవలు**
**ఎవరికి ఏ కష్టమొచ్చినా స్పందించే తత్వం**
**పదవి లేకున్నా ప్రజాసేవ చేయవచ్చని నిరూపించిన యువ కెరటం**

**షాద్‌నగర్, డిసెంబరు 5, ప్రభాతవార్త :** అసెంబ్లీ ఎన్నికలను తలపించేలా సర్పంచ్ కుర్చీ కోసం పలు చోట్ల హోరా హోరీ పోరు జరుగుతున్న వేళ.. ఫరూక్ నగర్ మండలం అయ్యవారిపల్లి గ్రామ పంచాయతీలో ఇందుకు భిన్నమైన వాతావరణం కనిపించింది. పంచాయతీ జనరల్ కేటగిరీ కోటాలోకి వెళ్లింది. సహజంగా జనరల్ స్థానంలో ఎన్నిక అంటే రాజకీయం రసకందాయంలో ఉంటుంది. కోట్లలో ఖర్చు చేసైనా గెలిచి తీరాల్సిందే అన్నంత పట్టుదల ఉంటుంది. అన్ని పంచాయతీలలో మాదిరిగా అక్కడ అధికారం.. ఆధిపత్యం కోసం గ్రామ పెద్దలు అర్రులు చాచలేదు. అడ్డదారులు తొక్కే ప్రయత్నం చేయలేదు. ఒకరిపై ఒకరు పోటీకి దిగలేదు. ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాలు చేయలేదు. వాగ్దానాలు లేవు.. ప్రచారం లేదు.. ప్రలోభాలు లేవు.. అందరిదీ ఒక్కటే మాటగా తీర్మానించారు. గ్రామం కోసం నిజాయతీగా పనిచేసే తత్వం.. నిస్వార్థంగా.. ప్రజలకు బాసటగా నిలవ గలిగే ధైర్యం వంటి లక్షణాలు గీటురాయిగా ఉన్న వ్యక్తికి పగ్గాలు అప్పగించాలని నిర్ణయించారు. అందరివాడుగా గుర్తింపు పొందిన గోపాల్‌రెడ్డికి ఆ గ్రామం ముక్త కంఠంతో పంచాయతీ పగ్గాలు అప్పగించింది.

సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన గోపాల్ రెడ్డి గ్రామంలో మా పల్లెలో గోపాలుడుగా అందరిని అక్కున చేర్చుకున్నాడు. అనేక ఆటుపోట్లు ఎదుర్కొని ప్రజా జీవితంలో నిలదొక్కుకున్నాడు. తనకు ఏ పదవీ, హోదా లేక పోయినా ప్రజలకు ఏ కష్టమొచ్చినా అండగా నిలుస్తూ ప్రజాసేవకు పదవులే ఉండాల్సిన అవసరం లేదని నిరూపించాడు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి తనకు అవకాశం ఉన్నంతలో ఉడతాభక్తిగా చేయూత ఇచ్చాడు. వివిధ సందర్భాలలో గ్రామ సమస్యలపై స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పరిష్కారానికి కృషి చేశాడు. పలు సామాజిక సేవా కార్యక్రమాలలో కూడా చురుగ్గా పాల్గొన్నాడు. అయ్యవారిపల్లిలోనే కాకుండా చుట్టుపక్కల పల్లెల్లో కూడా గోపాల్ రెడ్డి చేసిన సేవా కార్యక్రమాలు ఆయనను హీరోగా నిలబెట్టాయి.



సర్పంచ్‌గా ఎన్నుకున్న గోపాల్ రెడ్డికి మిఠాయి తినిపిస్తున్న దృశ్యం

ఈ క్రమంలో పంచాయతీ బరిలోకి అయ్యవారిపల్లి నుంచి కొందరు అభ్యర్థులు దిగుదామనుకుని కూడా గ్రామ ప్రజల శ్రేయస్సే ధ్యేయంగా వెనక్కి తగ్గారు. గోపాల్ రెడ్డి అయితే గ్రామాభివృద్ధి వేగంగా జరుగుతుందని భావించారు. ప్రజల సమస్యలు తెలిసిన వ్యక్తిగా గ్రామాన్ని అభివృద్ధి చేయగలరని బలంగా నమ్మారు. నామినేషన్లు ఉపసంహరించుకొని గోపాల్ రెడ్డిని సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నియోజకవర్గంలో కొన్ని ఏకగ్రీవాలు అయినప్పటికీ ఫరూక్ నగర్ మండలంలో జనరల్ కేటగిరీలో ఒకే ఒక ఏకగ్రీవ పంచాయితీ అయ్యవారిపల్లి కావడం గమనార్హం. పిలిస్తే పలికే వ్యక్తిగా, అన్నింటా తానున్నానంటూ ముందుకు సాగి అభివృద్ధి పదం వైపు పల్లెను నడిపించే నాయకుడిగా ఇంతింతై ఎదిగిన గోపాల్ రెడ్డి ఎన్నిక లేకుండా ప్రథమ పౌరుడిగా ఎన్నిక కావడం పట్ల ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అభినందిచారు. ఫరూక్ నగర్ మండలంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిగా గోపాల్ రెడ్డి తొలి బోణీ కొట్టడం పార్టీకి మంచి బూస్టు లభించిందన్నారు. పెండింగ్‌లో ఉన్న అయ్యవారిపల్లి వాగు వంతెన పని తాను త్వరలోనే పూర్తి చేయిస్తానని సర్పంచ్ ఏకగ్రీవ చేసినందుకు బహుమతిగా గ్రామస్తులకు హామీ ఇచ్చారు. గ్రామ అభివృద్ధికి కూడా పూర్తిస్థాయిలో సహకరిస్తానని ఆయన వెల్లడించారు. గోపాల్ రెడ్డి స్పందిస్తూ గ్రామస్తులు, స్థానిక పెద్దలు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని భరోసా ఇచ్చారు. పూర్తిస్థాయిలో గ్రామ అభివృద్ధికి పాటుపడతానని వెల్లడించారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా తాను ముందుండి సమస్య తెచ్చేందుకు కృషి చేస్తానని అన్నారు.



ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి

# మీ ఊరి బాధ్యత నాది..

**మొగిలిగిద్ద గ్రామస్తులకు**
**మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి భరోసా**

**షాద్‌నగర్, డిసెంబరు 5, ప్రభాతవార్త :** మొగిలిగిద్ద గ్రామంలో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి అంబటి రాజుకు మద్దతుగా షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, మైనార్టీ నేత మహమ్మద్ ఇబ్రహీం, సయ్యద్ ఖదీర్, ఇసాక్ తదితర మైనార్టీ నాయకులు పాల్గొన్నారు. ముస్లిం పెద్దలతో ప్రతాప్ రెడ్డి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఉంగరం గుర్తుకు ఓటు వేసి రాజును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం గ్రామంలో మహిళలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిచాల్సిన ఆవసరాన్ని వారికి వివరించారు. రాజులు

మిగతా 2లో

# ఐఐఆర్‌ఎంలో అఖిలారెడ్డి స్మృతివనం

**చేవెళ్ల బస్సు సంఘటన విద్యార్థిని పేరిట మొక్కలు నాటిన యాజమాన్యం**

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, డిసెంబరు 5, ప్రభాతవార్త :** సరిగ్గా నెల రోజుల క్రితం చేవెళ్ల సమీపంలో జరిగిన బస్సు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన విద్యార్థిని అఖిలారెడ్డి స్మారకార్థం హైదరాబాద్ ఐఐఆర్‌ఎంలో అఖిలారెడ్డి స్మృతివనం ఏర్పాటు చేశారు. శుక్రవారం గచ్చిబౌలిలోని ఐఐఆర్‌ఎం కళాశాల ఆవరణలో ఆమె స్మారకార్థం పండ్లు, పూల మొక్కలు నాటారు. చేవెళ్ల బస్సు ప్రమాదంలో 19 మంది దుర్మరణం చెందిన విషయం తెలిసిందే. అందులో యాలాల మండలం లక్ష్మీనారాయణపూర్ గ్రామానికి చెందిన అఖిలారెడ్డి కూడా ఉన్నారు. ఐఐఆర్‌ఎం బిజినెస్ స్కూలులో ఆమను స్మరిస్తూ ఘనంగా నివాళులు అర్పించారు. ఎంబీఏ మొదటి సంవత్సరంలో అన్ని సబ్జెక్టులలో మంచి ప్రావీణ్యం చూపించిన అఖిల గురించి ఉపన్యాసకులు, సహచర విద్యార్థినులు నెమరు వేసుకున్నారు.



మొక్కలు నాటుతున్న అఖిలారెడ్డి తల్లి, యాజమాన్యం ప్రతినిధులు



అఖిలారెడ్డి (ఫైల్ ఫొటో)

బీఎస్సీ అగ్రికల్చర్ తర్వాత భిన్నమైన కోర్సులో చేరినా మంచి ప్రతిభ కనబర్చిందని కాలేజీ యాజమాన్యం గుర్తు చేసింది. స్మృతివనం ఏర్పాటు సందర్భంగా బాధిత కుటుంబీకులను ఆహ్వానించారు. అఖిలారెడ్డి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కుటుంబీకులను ఓదార్చారు. విద్యార్థిని చెల్లించిన ఫీజును తిరిగి కుటుంబ సభ్యులకు ఇచ్చేందుకు యాజమాన్యం ముందుకు వచ్చింది. కార్యక్రమంలో డైరెక్టర్ డాక్టర్ అటన్‌కుమార్, ప్రిన్సిపల్ వీవీ మోహన్, సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి కే.శ్రీధర్, ఆర్,జగన్నాథ్, జ్యోతి, అఖిలారెడ్డి తల్లి గుర్రాల అలివేలు, కుటుంబ సభ్యులు గుర్రాల సరస్వతి, గుర్రాల సందీప్‌రెడ్డి, గుర్రాల కార్తీక్‌రెడ్డి, ఆర్వీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల సిబ్బంది శిక్షణాశిబిరంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

# పోలింగ్ కేంద్రాల్లో అతి నమ్మకం వద్దు

**ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాల్సిందే : కలెక్టర్**

**కొడంగల్, డిసెంబర్ 5 ప్రభాతవార్త :** గ్రామపంచాయతీ ఎన్నికలు సజావుగా పారదర్శకంగా నిర్వహించేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. శుక్రవారం కొడంగల్ పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పోలింగ్, అసిస్టేంట్ పోలింగ్ అధికారులకు గ్రామ పంచాయతీ ఎన్నికల విధి విధానాలపై చేపట్టాల్సిన అంశాలపై నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ అకస్మికంగా తనిఖీ చేసి తగు సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా చూడాలన్నారు. పోలింగ్ కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అనుమానాలకు తావునీయకుండా ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా తెలుసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

పోలింగ్ కేంద్రాల్లో అధికారులు అతి నమ్మకంతో కాకుండా మార్గదర్శకాలకు అనుగుణంగా అధికారులు ఎన్నికల విధులను నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి గుర్తులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో కావాల్సిన మౌలిక సదుపాయాలను ముందుగానే సమకూర్చుకోవాలని కలెక్టర్ తెలిపారు.పోలింగ్ కేంద్రాల్లో బ్యాలెట్ పేపర్ ఇచ్చే విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రతి ఓటరు స్లిప్‌ను పరిశీలించి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలని అధికారులకు సూచించారు. పోలింగ్ సమయానికి అనుకూలంగా అధికారులు పోలింగ్ సామగ్రితో పాటుగా ముందస్తుగానే సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.గ్రామపంచాయతీ ఎన్నికల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా సంభందిత అధికారులకు ధరకాస్తులు సమర్పించాలని కలెక్టర్ సూచించారు. శిక్షణ కార్యక్రమంలో తహాశీల్దార్ రాంబాబు,ఎంపీడీఓ ఉషశ్రీ పాల్గొన్నారు.



# ఓటు మారిందని..

**నర్సంపల్లి పంచాయతీ ఎన్నిక బ్రేక్**
**ఓటరు ఫిర్యాదుపై హైకోర్టు విచారణ**
**నిలుపుదలకు ఆదేశం**

**మాడ్గుల, డిసెంబరు 5, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలంలోని నర్సంపల్లి గ్రామపంచాయతిలో సాధారణ ఎన్నికలు ఆపాలంటూ శుక్రవారం తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. నర్సంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని చౌటకుంట తాండకు చెందిన నేనావత్ సోనీ భర్త హన్మనాయక్ గత నెలరోజుల క్రితం తన ఓటు వేరే గ్రామంలో పడిందని మండల తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయగా నర్సంపల్లి కి మార్చినట్టు తెలిపారని, ఈ క్రమంలో స్థానికంగా జరుతున్న ఎన్నికలలో నర్సంపల్లి గ్రామపంచాయితీ ఎస్టీ మహిళకు రిజర్వ్ అయి ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో సదరు మహిళ నామినేషన్‌కు సిద్ధం కాగా ఓటర్ జాబితాలో తన ఓటు లేకపోవడతో హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఓటరు

మిగతా 2లో

# సెల్ టవర్ ఎక్కి బాధిత రైతు నిరసన

**ఉన్నతాధికారులతో చర్చించి న్యాయం చేస్తామని ఆర్డీవో హామీ**

**మొయినాబాద్, డిసెంబరు 5, ప్రభాతవార్త :** పెద్దమంగళారం రెవెన్యూలోని కొల్లీఫారమ్ భూమికి చెందిన బాధిత రైతుల ఆందోళన ఉధృతమవుతోంది. శుక్రవారం ఓ రైతు సెల్‌టవర్ ఎక్కి నిరసన తెలిపారు. ఈ విషయం తెలియగానే, చేవెళ్ల ఆర్డీవో, మొయినాబాద్ ఎమార్వోలు సంఘటనా స్థలం వద్దకు చేరుకున్నారు. బాధిత రైతుల సమస్యను సమగ్రంగా తెలుసుకున్నారు. పై అధికారులతో సంప్రదింపులు జరుపుతామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఆదేశించిన ఈ వ్యవహారంలో వెంటనే రైతుల పక్షాన నిర్ణయం తీసుకునే అధికారం తమకు లేదని నచ్చచెప్పారు. గతంలో ప్రభుత్వం రైతులకు కేటాయించిన భూముల పత్రాలను తీసుకున్నారు. అనంతరం ఆర్డీవో జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డితో ఫోన్‌ల్లో మాట్లాడి ఇక్కడి పరిస్థితని, రైతుల డిమాడ్లను వివరించారు. పంచాయతీ ఎన్నికలు అయ్యే వరకూ సమయం ఇవ్వాలని కోరారు. ఆ తరువాత కలెక్టర్‌తో స్వయంగా సంప్రదింపులు జరిపి న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. తహసిల్దార్ గౌతమ్ కుమార్ మాట్లాడుతూ పెద్దమంగళారం సర్వే నెం 218లో 36 మంది దళిత కుటుంబాలకు 40 ఏళ్ళక్రితం కేటాయించబడిన కొల్లీఫారమ్‌లకు సంబంధించిన భూమి విషయంలో జిల్లా కలెక్టర్, ఆర్డీవోలతో మాట్లాడమని, పై అధికారులతో చర్చించి, వారి దగ్గర ఉన్న పత్రాలను పరిశీలించి సరైన న్యాయం చేస్తామన్నారు. నిరుపేదలుగా ఉన్నందున మానవత దృక్పథంతో పై అధికారులతో చర్చలు చేసి తగిన న్యాయం చేస్తామని సహనం పాటించి కొంత సమయం కావాలని కోరారు.



అరుణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

## అరుణ్‌కుమార్ యువతకు ఆదర్శప్రాయుడు

**పెద్దేముల్, డిసెంబరు 5, ప్రభాతవార్త:** మండల పరిధిలోని మంబాపూర్ గ్రామానికి చెందిన జే. అరుణ్‌కుమార్ అగ్నివీర్‌లో ఆర్మీ ఉద్యోగం సాధించిన సందర్భంగా కోటపల్లి మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ ఎస్. నారాయన్‌రెడ్డి ఆయనను అభినందించారు. బీద కుటుంబంలో పుట్టి దేశ సేవ కోసం ఆర్మీలో చేరిన అరుణ్ కుమార్ యువతకు ఆదర్శ ప్రాయులని కొనియారు. పుట్టిన గడ్డ రుణం తీర్చుకోవడానికి ఆర్మీ ఉద్యోగం ఎంతో దోహదపడు తుందన్నారు. అగ్నివీర్ పథకంలో బాగంగా ఆర్మీ ఉద్యోగంలో చేరి శిక్షణ పూర్తి చేసుకున్న అరుణ్ కుమార్‌ను నాయకులు, గ్రామస్తులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆర్,శ్రావణ్, గ్రామ కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు యండి మైపూస్, నాయకులు డి,సుధాకర్ రావు, ఎస్, శ్రీనివాస్‌రెడ్డి, గ్రామస్థులు యండి ఇబ్రాహీం, రాజవర్ధన్‌రెడ్డి, యండి మక్సూద్, పీటర్ యాదప్ప, దస్థప్ప, అనిఫ్ తదితరులు పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి

## మాజీ జెడ్పీటిసి వెంకటరాంరెడ్డికి పరామర్శ

**షాద్‌నగర్, డిసెంబరు 5, ప్రభాతవార్త:** ఫరూఖ్ నగర్ మాజీ జెడ్పిటిసి సభ్యుడు, తెలంగాణ ఉద్యమకారుల వెల్ఫేర్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కాంగ్రెస్ నేత పి వెంకట్రామిరెడ్డిని షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, కొత్తూరు మాజీ జెడ్పిటిసి సీనియర్ నేత మామిడి శ్యాంసుందర్ రెడ్డిలు పరామర్శించారు. మధు జడ్పిటిసి వెంకటరామిరెడ్డి తండ్రి రాంరెడ్డి మృతి చెందడంతో ఈరోజు వారు మధురాపురం గ్రామానికి వచ్చారు. ఈ సందర్భంగా వెంకట్రాంరెడ్డిని పరార్శించి ధైర్యం చెప్పారు. అనంతరం కుటుంబ సభ్యులను కూడా ఓదార్చి పరామర్శించారు.



**బిఆర్ఎస్‌లో చేరుతున్న కుందేల్ కుంట తాండ కాంగ్రెస్ నాయకులు**

**..హామీల అమలులో కాంగ్రెస్ విఫలం..మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్**

**షాద్‌నగర్ టౌన్, డిసెంబరు 5, ప్రభాతవార్త:** ఫరూఖ్ నగర్ మండలం కుందేల్ కుంట తండా గ్రామ కాంగ్రెస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ గారి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి మాజీ ఎమ్మెల్యే గారు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచిన ప్రజలకు ఇచ్చిన హామీల అమలలో విఫలమైందని అన్నారు. ప్రజలకు మేలు చేసిన ప్రభుత్వం బీఆర్ఎస్ అని, ప్రలందరూ కేసీఆర్ పాలనకోసం ఎదురుచూస్తున్నారు అని తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ గారు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరినవారిలో మెఘావత్ లక్ష్మణ్ నాయక్, రమేష్, భాస్కర్, లోకేష్, శ్రీనివాస్, రాం దాస్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు లక్ష్మణ్ నాయక్, నాయకులు రవి తదితరులు పాల్గొన్నారు.

## పేర్లలోని వర్ణమాల ఆధారంగా గుర్తులు కేటాయిస్తాం

**అథారిటి జిల్లా ఎన్నికల అధికారి సంధ్య**

**మొయినాబాద్, డిసెంబరు 5, ప్రభాతవార్త:** సర్పంచ్ వార్డు ఎన్నికలకు శనివారం 3 గంటల వరకు విత్‌డ్రాలు, అనంతరం ఎన్నికలో పోటిచేసేవారికి గుర్తులను కేటాయిస్తామని అథారిటి జిల్లా ఎన్నికల అధికారి సంధ్య తెలిపారు, రేపు జరగనున్న విత్‌గ్రా కార్యాక్రమంలో అభ్యర్థులు పాల్గోనవచ్చని తెలిపారు, శనివారం మొదట ఎవరైనా వారి నామినేషన్‌ను విత్‌డ్రా చేసుకునే అవకాశం ఉంటుందని, అనంతరం అభ్యర్థులకు గుర్తుల కేటాయింపులు వారి యొక్క పేర్లు వర్ణమాల ఆధారంగా కేటాయించబడుతాయని, మొయినాబాద్ అథారిటి జిల్లా ఎన్నికల అధికారి సంధ్య తెలిపారు.

## పాన్‌షాప్‌లో చోరీ

**ధారూరు, డిసెంబరు 5, ప్రభాతవార్త:** ధారూర్ మండల కేంద్రంలోని పాన్ షాప్‌లో చోరీ జరిగిన సంఘటన గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు,స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన మహమ్మద్ ఫయాజ్ కోట్ పల్లి కూడలి వద్ద గత కొంతకాలంగా పాన్ షాప్ నిర్వహిస్తున్నాడు. కాగా గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు షాప్ తాళం పగలగొట్టి అం దులో పది వేల రూపాయల విలువగల పాన్ సామాగ్రి, సిగరెట్ ప్యాకెట్లతోపాటు మూడు వేల రూపాయల నగదు తీసుకెళ్లి పోయారు. బాధితుని ఫయాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాఘవేందర్ తెలిపారు.



చోరీ జరిగిన పాన్ షాప్

# ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నాట్కో చేయూత

**షాద్‌నగర్, డిసెంబరు 5, ప్రభాతవార్త :** షాద్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలో నూతనంగా చేపట్టిన ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి చేయూతగా శుక్రవారం నాట్కో కంపెనీ భారీ విరాళం ప్రకటించింది. కంపెనీ ప్రతినిధులు లక్ష్మీనారాయణ, మేనేజర్ సత్యనారాయణ రూ.50 లక్షల చెక్కును ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు అందజేశారు. నాట్కో యాజమాన్యాన్ని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు. తన సంక ల్పాన్ని వదాన్యులు అర్థం చేసుకుని మంచి పని కోసం ప్రోత్సహించటం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్యే వీలపల్లి శంకర్ ఆధ్వర్యంలో కొట్టాది రూపాయలు వెచ్చించి సమిష్టి విరాళాల ద్వారా భారీ ఎత్తున భవనాన్ని నిర్మిస్తున్న సంగతి విదితమే. ఇప్పటివరకు ఎందరో స్వచ్ఛందంగా విరాళాలను పెద్ద ఎత్తున ప్రకటించారు. ఈ సందర్భంగా కళాశాల నిర్మాణ పనులను నాట్కో బృందానికి ఎమ్మెల్యే స్వయంగా చూపించారు. కళాశాల నిర్మాణం కోసం అహర్నిశలు పాటుపడుతున్నానని ఆయన తెలిపారు. ఇందులో తన స్వార్థం ఏమీ లేదని గ్రహించిన నాట్కో యా జమాన్యం 50 లక్షల రూపాయలు విరాళం అందజేయడం ఊహించని పరిణామని అన్నారు. నాట్కో పరిశ్రమ ఈ ప్రాంతంలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. కొత్తూరు ఉమ్మడి మండలంలో ఎన్నో ఉన్నతమైన పాఠశాలలు ఇతర విద్య మౌలిక సదుపాయాలు కల్పించిందని అభినందిచారు. ఇంకా అనేక సామాజిక సేవలు ఔషధ రూపంలో ఇతర వస్తు రూపేణా చేసిన సందర్భాలు ఉన్నాయని వివరించారు. ఆ కంపెనీకి ఈ ప్రాంత ప్రజలు ఎల్లవేళలా రుణపడి ఉంటారని అన్నారు. ఎమ్మెల్యే చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాల స్ఫూర్తితో తమ అసోసియేషన్ తరపున వీలైనంత సహకారం అన్ని విధాలు అందజేస్తామని నాట్కో ప్రతినిధులు అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, సీనియర్ నాయకుడు అగ్గనూర్ బస్వ న్న,చెంది తిరుపతి రెడ్డి,సాయి కృష్ణ, మహ్మద్ ఇబ్రహీం,శ్రీనివాస్ యాదవ్, రాజేందర్ రెడ్డి, ముబారక్ అలీ ఖాన్, సీతారాములు అర్జున్ లక్ష్మణ్ మాణిక్యం లింగారెడ్డి గూడ అశోక్ సోలీపూర్ అనిల్ రవితేజ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే శంకర్‌కు రూ.50 లక్షల చెక్కు అందజేస్తున్న నాట్కో యజమాన్యం ప్రతినిధులు

# ప్లాస్టిక్‌ను తగ్గించి జూట్ సంచులను వినియోగించాలి



జూట్ తయారీ శిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పావని జంగయ్యయాదవ్

**ఘట్‌కేసర్, డిసెంబరు 5, ప్రభాతవార్త:** ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా జూట్ సంచులను వాడాలని ఘట్‌కేసర్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ అన్నారు. జిహెచ్‌ఎంసీ ఘట్‌కేసర్ సర్కిల్ ఇడబ్ల్యుఎస్‌కాలనీ స్వామి వివేకానంద కమ్యూనిటీహాలులో సెంట్రల్ ఇన్సిస్ట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జూట్ బ్యాగ్‌ల తయారీ శిక్షణను ఆమె శుక్రవారం పరిశీలించారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్‌ను వాడకుండా జ్యూట్ సంచులను వినియోగించాలని జ్యూట్ బ్యాగుల తయారీ ద్వారా స్వయం ఉపాధి పొందవచ్చిని ఆమె పేర్కొన్నారు. సీఐటీడీ ద్వారా అందిస్తున్న శిక్షణతో మహిళలు సొంతంగా జ్యూట్ సంచులనఉ తయారీ చేసి ఉపాధి కల్పించుకోవాలని ఆమె సూచించారు. ఈకార్యక్రమంలో సీఐటీడీ అధికారి రాజేశ్వరీ, మాజీ వార్డుసభ్యులు బర్ల దేవేందర్, నాయకులు కేశవపట్నం అంజనేయులు, బర్ల రాధాకృష్ణ, దంతూరి గోపాల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పంచాయితీ ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**

**పరిగి, డిసెంబరు 5, ప్రభాతవార్త:** గ్రామ పంచాయతీ ఎన్నికలు సజావుగా నిర్వహించేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు..శుక్రవారం పరిగి మండలంలోని నామినేషన్లు స్వీకరిస్తున్న రంగంపల్లి క్లస్టర్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. రంగంపల్లి క్లస్టర్ లో రంగంపల్లి, సాలెపూలబాట తండా, సందేపూర్ తండాల గ్రామపంచాతీలకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు..ఈ సందర్భంగా అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ....గ్రామ ప్రంచాయతీల ఎన్నికలు సజావుగా నిర్వహించే క్రమంలో నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి తప్పులు, పొరపాట్లు లేకుండా చూడాలన్నారు. అవసరానికి అనుగుణంగా సిబ్బందిని పెంచుకోవాలని కలెక్టర్ సూచించారు. నామినేషన్లు దాఖలు చేసే క్రమంలో కావలసిన ధృవ పత్రలను సమర్పించడం లాంటి విషయాలను అభ్యర్థులకు తెలియజేయాలని ఆయన తెలిపారు. నామినేషన్ల ఫారాలను స్పష్టంగా చూసి వాటిల్లో ఏవైనా తప్పులు వుంటే సరిచేసుకునే విధంగా అభ్యర్థులకు సహకరించాలని కలెక్టర్ సూచించారు.



నామినేషన్ల స్వీకరణను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

# నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలి

**సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్**



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

**పెద్దేముల్, డిసెంబరు 5, ప్రభాతవార్త:** గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం పెద్దేముల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్నికల నియమావళిపై పిఓలకు (ప్రిసిడింగ్ అధికారులు) అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల నియమావళిని ఎట్టి పరిస్థితుల్లోను ఖచ్చితంగా అమలు చేయాలని అన్నారు. ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేలాచూడాలని అధికారులను ఆదేశిం చారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ వెంకటేష్ ప్రసాద్, యంపిడిఓ రతన్‌సింగ్, మండల విద్యాధికారి నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుండేలా..

(మొదటి పేజీ తరువాయి)

చెప్పులు, గాలిబుడగ, క్రికెట్ స్టంప్స్ తదితర గుర్తులను గుర్తుంచుకోవాలంటూ సర్పంచ్ అభ్యర్థులు ప్రచారం మొదలు పెట్టారు. ఈ ప్రచారం అటు సోషల్ మీడియాలో ఇటు ప్రచారంలో హీట్ పుట్టిస్తోంది. కరపత్రాలు, తొలి దశ ఎన్నికలు జరిగే ఏడు మండలాల్లో ఈ ఆన్‌లైన్ ప్రచారం పతాక స్థాయికి చేరింది. ఈనెల 11వ తేదీన తొలి దశ ఎన్నికలు జరగనున్న షాద్‌నగర్ నియోజవర్గంలోని ఆరు మండలలతోపాటు శంషాబాద్ మండలం 174 గ్రామ పంచాయితీలలో 6గ్రామ పంచాయితీలు ఏకగ్రీవం అయ్యాయి. 1530 వార్డు సభ్యులకు 190 వార్డుల్లో ఒక్క నామినేషన్ ఉండంతో ఏకగ్రీవం అయినట్లు అధికారులు తెలిపారు. రెండవ విడుతలో ఆమన్‌గల్లు, చేవేళ్ల, కడ్తాల్, మొయినాబాద్, షాబాద్, శంకర్‌పల్లి, తలకొండపల్లి మండలలో ఎన్నికలు జరుగునున్నాయి. 178 గ్రామపంచాయితీ సర్పంచ్ స్థానాలకు 764 మంది అభ్యర్థులు పోటి పడుతున్నారు.1540 వార్డు స్థానాలకు 3969 మంది అభ్యర్థులు పోటిపడుతున్నారు.అభ్బుర్థులు నామినేషన్ విత్‌డ్రా సమాచారం తెలియవలసి ఉంది.

## మీ ఊరి బాధ్యత నాది

(మొదటి పేజీ తరువాయి)

సర్పంచ్‌గా గెలిపిస్తే ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేసే బాధ్యతను తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. రేషన్ కార్డులు ఇందిరమ్మ గృహాలు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలతో పాటు అనేక సదుపాయాలు కలుగుతాయని వివరించారు. ఎమ్మెల్యే శంకర్ మొగిలిగిద్ద గ్రామపంచాయతీ పై ప్రత్యేక దృష్టి పెట్టారని.. గ్రామానికి కావలసిన అన్ని వసతులు సమకూర్చుతారని తెలిపారు. ఈ గ్రామాన్ని పెద్ద ఎత్తున అభివృద్ధి చేసేందుకు ఇటీవల కాలంలో ముఖ్యమంత్రి ప్రత్యేక నిధులు చేస్తున్నారని గుర్తుచేశారు. పాఠశాల భవన నిర్మాణానికి కూడా సిఎం సుముఖత వ్యక్తం చేశారని తెలిపారు. అంబటి రాజుకు పట్టం కడితే గ్రామం బాగుపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్ మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం, నేతలు మహ్మద్ ఇబ్రహీం, ముబారక్ అలీ ఖాన్, ఖదీర్, ఇసాక్, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.



**మానసిక వికలాంగులతో ఏర్పాటు చేసిన హస్తకళా ప్రదర్శన**

**ఘట్‌కేసర్, డిసెంబరు 5, ప్రభాతవార్త:** జిహెచ్‌ఎంపీ ఘట్‌కేసర్ సర్కిల్ ఘణాపూర్ రోడ్డులోని చైల్డ్‌గెడెన్స్ సెంటర్‌లో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మానసిక వికలాంగులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక హస్తకళా ప్రదర్శనను తిలకించి విద్యార్థులకు బహుమతి అందజేస్తున్న మేడ్చల్ బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



**అయ్యప్ప మాల దీక్షను స్వీకరించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్**

**హైదరాబాద్ డిసెంబర్ 5 (ప్రభాతవార్త ) :** అంబర్ పేట్ అసెంబ్లీ నియోజకవర్గం శాసనస భ్యుడు కాలేరు వెంకటేష్ శుక్రవారం స్వామి అయ్యప్ప స్వామి మల దీక్షను స్వీకరించారు. బాగ్ అంబర్‌పేట్ అయ్యప్ప స్వామి ఆలయంలో మాలను గురుస్వామి చేతులమీదుగా శుక్రవారం తీసుకున్నారు. స్వామి అయ్యప్ప స్వామి కృపతో నియోజక ప్రజలందరికీ శాంతి, ఆనందం కలగా లని ఆకాంక్షి ంచారు. ఈ సందర్భంగా ఓం శ్రీ స్వామియే శరణమయ్యప్ప శరణు ఘోషతో ఈ ప్రాంతమంతా మారుమ్రోగింది.



అయ్యప్ప స్వామి పడిపూజలో పాల్గొన్న భక్తులు

## వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ

**పెద్దేముల్, డిసెంబరు 5, ప్రభాతవార్త:** పెద్దేముల్ మండలం జనగాంలో శుక్రవారం అయ్యప్ప స్వామి పడిపూజను అంగరంగ వైభవంగా నిర్వహించారు. జనగాం గ్రామానికి చెందిన దొరొళ్ళ అంజిల్‌రెడ్డి వెంకటమ్మ దంపతుల కుమారుడు మధుసుధన్‌రెడ్డి కన్నె స్వామి అధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్పస్వామి పడిపూజకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అయ్యప్పస్వామి భక్తులు ఆలపించిన గీతాలతో పరిసర ప్రాంతాలు అయ్యప్పనామ స్మరణతో మారుమోగాయి. ఈ కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



అయ్యప్ప పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

## షాద్ నగర్ పట్టణంలో..

**షాద్‌నగర్ టౌన్, డిసెంబరు 5, ప్రభాతవార్త :** షాద్ నగర్ పట్టణం ఆర్టీసీ కాలనీ లో నిన్నటి రోజున అంబటి చంద్రశేఖర్ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి పడిపూజ అంగరంగ వైభవంగా జరిగింది. ఈ రోజు అయ్యప్ప స్వామి పూజ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయ్యప్ప స్వామి ఆశీస్సులతో షాద్ నగర్ ప్రజలు సుభిక్షంగా ఉండాలని, నియోజకవర్గంలోని ప్రతి ఇంటిలో శుభం చేకూరాలి, శాంతి, సౌభాగ్యాలు వెల్లివిరియాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ అధ్యక్షులు నటరాజ్, లక్ష్మణ్ నాయక్ నాయకులు పిల్లి శేఖర్, భిక్షపతి, గుండు అశోక్, చెర్క శివ, సుమధీర్, శీలం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం

కొత్తూరు, డిసెంబర్ 5, ప్రభాతవార్త; కొత్తూరు మున్సిపాలిటీ కేంద్రంలో హనుమాన్ దేవాలయంలో అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని శుక్రవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సిద్దాపూర్ శేఖర్ రెడ్డి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 41 రోజులపాటు అయ్యప్ప స్వామి మాల ధరించి పవిత్రంగా స్వామి వారి సేవలో కఠిన దీక్షలో నిత్యం పూజ నిర్వహిస్తారు. అలాంటి పవిత్రమైన అయ్యప్ప స్వాములకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ఈ సన్నిధానంలో ప్రతి సంవత్సరం అయ్యప్ప స్వాములకు అన్నదానం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, అందరూ భాగంగా ఈ సంవత్సరం కూడా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప సేవ సమితి అధ్యక్షులు ఎర్రవెల్లి నాగరాజు చారి గురుస్వామి, దాసరి నరసింహ గురుస్వామి, గుబ్బ కిరణ్ గుప్తా గురు స్వామి, గోపి గురుస్వామి, ఆంజనేయులు గురుస్వామి, నరసింహస్వామి, కిషోర్ స్వామి, పిట్టల శేఖర్ గౌడ్ స్వామి, కరెంటు బాలు స్వామి, బైండ్ల శ్రీకాంత్ స్వామి, జవాజి వంశీ స్వామి, పెండ్యాల అరుణ్ స్వామి, చరణ్ స్వామి పాల్గొన్నారు.



అన్నప్రసాదం స్వీకరిస్తున్న అయ్యప్ప స్వాములు



## చివరిరోజు భారీగా నామినేషన్‌లు దాఖలు

**మంచన్‌పల్లిలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామపత్రాలు అందజేస్తున్న సర్పంచ్ అభ్యర్థి సిహెచ్ నర్సింహ్మా తదితరులు**

**పూడూరు, డిసెంబరు 5, ప్రభాతవార్త :** గ్రామపంచాయతీ ఎన్నిల సందర్భంగా చివరిరోజు శుక్రవారం పూడూరు మండలంలోని వివిధ క్లస్టర్ కేంద్రాల్లో సర్పంచ్,వార్డు సభ్యుల నామినేషన్ పత్రాలు భారీగా దాఖలు అయ్యాయి. మండలం పరిధిలో 32 గ్రామ పంచాయతీలు ఉండగా,నామపత్రాల స్వీకరణ కోసం మొత్తం 9క్లస్టర్లను అధికారయంత్రాంగం ఏర్పాటు చేయడంతో ఆయా గ్రామ పంచాయతీలకు చెందిన సర్పంచ్ అభ్యర్థులు,వార్డుసభ్యులు తమ నామపత్రాలను రిటర్నింగ్ అధికారులకు అందజేశారు. సోమన్‌గుర్తి క్లస్టర్‌లో తిర్మలాపూర్ సర్పంచ్ అభ్యర్థిగా అనూష,మన్నెగూడ క్లస్టర్‌లో మన్నెగూడ సర్పంచ్ అభ్యర్థిగా దరక్షణ్ తమ్మన్నా,ఎన్కెపల్లి సర్పంచ్ అభ్యర్థిగా దయాకర్,కెరవెల్లి క్లస్టర్‌లో దేవనోనిగూడ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా ఉదాన్‌రావు లాస్య అశోక్,కెరవెల్లి సర్పంచ్ అభ్యర్థిగా అలీం,మంచన్‌పల్లి క్లస్టర్‌లో మంచన్‌పల్లి సర్పంచ్ అభ్యర్థులుగా యు.రాఘవేందర్,ఇ రమేష్‌గౌడ్,వార్డు సభ్యుడుగా మాటుగూడ ఉప్పరి వెంకటయ్య,నిజాంపేట్ మేడిపల్లి సర్పంచ్ అభ్యర్థులుగా సిహెచ్ నర్సింహ్మా, జైపాల్‌రెడ్డిలు తమ నామపత్రాలను రిటర్నింగ్ అధికారులకు సమర్పించారు.

## ఓటు మారిందని ఎన్నిక వాయిదా

(మొదటి పేజీ తరువాయి)

జాబితాను పరిశీలించిన హైకోర్టు తక్షణమే నర్సంపల్లి జి.పి కి ఎన్నికలు నిలిపివేయాలని ఎన్నికల కమిషన్ ను ఆదేశించింది. దీంతో నర్సంపల్లి ఎన్నికలు ఆగిపోయాయి. కాగా ఈ విషయమై మండల సహాయ ఎన్నికల అధికారిణి ఎలాంటి ప్రకటన వెలువరించకపోవడం గమనార్హం.

**PUBLIC NOTICE**

The General Public is hereby informed that my clients: **Mirza Mustafa Ali Baig,** aged 38 years, Mirza Ahmed Ali Baig, aged 32 years, Mirza Ibrahim Ali Baig, aged 29 years, all son of Mirza Mohammed Ali Baig @ Abid Pasha, R/o H.No.19-3-201, Jahanuma, Falaknuma, Charminar, Hyderabad-500 053. agreed to purchase the House property property admeasuring 4598 Sq. Yards (Ac.0-38Gts.) out of Sy.N. 172 and 342 Sq. Yards (Ac.0-02) out of Sy. No. 173 situated at Kishannagar village and Grampanchayat, Farooqnagar Mandal, Ranga Reddy Dist., from 1. Jaddu Thomas Reddy S/o Jaddu Chinnapu Reddy, aged 42 years, R/o H.No.3-74, Ammapally Colony, Nekkonda, Ghanapur, [adcherla, Mahabubnagar Dist. T.S.- 2. Gade Praphyakar Reddy S/o Gade Joji Reddy, aged 36 years,, R/o H.No. 3-28, Buddasamudram Colony, Thimmajipet Mandal, Mahabubnagar Dist, T.S. 3. Jaddu Arogya Reddy S/o Jaddu Chinnapu Reddy, aged 40 years,, R/o H.No.3-74, Ammapally Colony, Nekkonda, Ghanapur, Jadcherla, Mahabubnagar Dist, 4. Thumma Lurdhu Marreddy S/o Thumma Salmon Reddy, aged 43 years, R/o Huzur Nagar, Nalgonda Dist. Rep. by their Agreement of Sale cum GPA holders: 1. Thadisetty Naveen Kumar S/o Thadisetty Prakash aged 35 years, R/o H.No.9-91, Vinayaka Gunj, Shadnagar Town, Farooqnagar Mandal, Ranga Reddy Dist. & 2. Pargi Abhishek Reddy S/o Pargi Venkata Sai Eashwar Reddy aged 22 Years, R/o H.No.11-120, Nethaji Road, Shadnagar Town, Farooqnagar Mandal, Ranga Reddy Dist. they agreed to sell for a valuable consideration, If any person/persons having any objection, right, title, interest or claim against said property, they shall notify the same to the undersigned with documentary proof within seven (7) days. Any objections received thereafter shall neither be entertained nor binding on my client who will proceed with the registration of sale deed of the said property.

**MOHD. MAZHAR ALI,**
**Advocate,**
12-2-800/50, Dilshad Nagar, Colony, Rethi Bowli, Hyd-28.
**Phone: 09246375870**

# ఇళ్ల స్థలాల పట్టాల విషయంలో సమగ్ర విచారణ జరపాలి

..అంతాయిపల్లిలోని గ్యాప్ ఏరియాలో ఉన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు చేపడితే చర్యలు
..శామీర్‌పేట మండల తహసిల్దార్ సంయుక్త


అంతాయిపల్లిలోని బిట్స్ సమీపంలోని పేదల కాలనీని సందర్శించి స్థానికులతో సమస్యను తెలుసుకుంటున్న తహసీల్దార్ సంయుక్త, పాల్గొన్న సిబ్బంది తదితరుల దృశ్యం

**శామీర్‌పేట, డిసెంబరు 5, ప్రభాతవార్త:** అంతాయిపల్లి సమీపంలోని బిట్స్ దగ్గర గల గ్యాప్ ఏరియా ఖాళీ స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపడితే తగు చర్యలు తీసుకుంటామని శామీర్‌పేట మండల తహసీల్దార్ సంయుక్త హెచ్చరించారు. శామీర్‌పేట మండలంలోని అంతాయిపల్లి రెవెన్యూ పరిదిలోని బిట్స్ సమీపంలో గ్యాప్ ఏరియా భూమిలో ఇళ్లపట్టాలు పొందిన వారు ఇళ్లు నిర్మించుకోవటంతో పేదల (బిట్స్ వద్ద) కాలనీ ఏర్పడింది. అయితే కొందరు నిర్మించుకోవటం, మరి కొందరు ఇళ్లను నిర్మించుకోకపోవటంతో ఖాళీ స్థలాల్లో ఇళ్ల పట్టాలు ఉన్నట్లు ఇళ్ల నిర్మాణాలు చేసుకోవటానికి వెళ్లటం కొందరు అడ్డుకోవటం వివాదస్పదంగా మారింది. కొందరు ఫేక్ ఇళ్లపట్టా సర్టిఫికెట్స్‌తో వస్తున్నారన్న విమర్శలు, పరస్పర ఆరోపణలు రావటంతో శామీర్‌పేట పోలీసుల వరకు, మండల తహసీల్దార్ వరకు ఇరు వర్గాల వారు ఫిర్యాదులు చేసుకోవటం జరిగింది. ఇళ్ల పట్టాల విషయంలో సమగ్ర విచారణ జరపాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అయితే దీంతో శామీర్‌పేట మండల తహసీల్దార్ సంయుక్త ఆ కాలనీని సందర్శించి ఇళ్ల పట్టాలు ఉన్న వారు మాత్రమే నిర్మించుకోవాలని ఉందని, అయితే కొందరు సకాలంలో ఇళ్లు నిర్మించుకోకపోవటం జరుగగా, మరి కొందరు ఫేక్ సర్టిఫికెట్స్‌తో వస్తున్నారని ఫిర్యాదులు వచ్చినట్లు, ఈ కాలనీలో ఇళ్లపట్టాలపై విచారణ జరపనున్నట్లు, ప్రస్తుతం ఎవరు కూడ ఇళ్ల నిర్మాణాలు చేపట్టవద్దని చేపడితే తగు చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేసింది. ఒరిజినల్ సర్టిఫికెట్స్‌పై, ఫేక్ సర్టిఫికెట్స్‌తో కొందరు వస్తున్నారన్న విమర్శలతో వాటిని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. అయితే తూంకుంట, అంతాయిపల్లి గ్రామాల్లోని పేదలకు 2003 సంవత్సరంలో నాడు టిడిపి ప్రభుత్వ హయాంలో పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసింది. అయితే సుమారు వెయ్యి మందికి పైగా ఇళ్లపట్టాలు పంపిణీ చేసినప్పటికీ, వీటిలో సుమారు 400వరకు ఇళ్ల పట్టాలు ఉన్నవారివి సర్వే చేస్తే పట్టాభూమిలోకి వెళ్లినట్లు వీటిలో కొందరు ఇళ్ల నిర్మాణాలు చేపడితే కూడ వాటిని గతంలో అధికారులు కూల్చివేయటం జరిగింది. అయితే మిగతా మరో 600కు పైగా ఉన్న వారు వరకు ఇళ్ల పట్టాలు ఉండి వీరిలో కొందరు ఇళ్ల నిర్మాణాలు చేపట్టి నివసించటం, పేదల కాలనీగా బిట్స్ దగ్గరి కాలనీగా పిలవబడుతుంది. అయితే కొందరు ఆర్థిక ఇబ్బందులతో ఇళ్ల నిర్మాణాలు చేసుకోలేదని, కొందరు మాత్రం ఇళ్ల పట్టాలను అమ్ముకున్నట్లు స్థానికుల నాయకుల, తీరును బట్టి స్పష్టం అవుతుంది. కొందరు ఇళ్లను నిర్మాణాలు చేపట్టటం, మరి కొందరు తాము కొనుగోలు చేశామని, మరి కొందరు తమకు ఇళ్లపట్టాలు ఉన్నట్లు ఒరిజినల్ అంటూ వస్తూ ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న సమయంలో అడ్డుకుంటూ ఇబ్బందులకు గురిచేస్తున్న విషయం వెలుగులోకి వచ్చి చర్చనీయాంశంగ మారింది. అయితే ఇళ్లపట్టాలు కొనుగోలు చేశామని ఇళ్లను నాయకులు నిర్మించుకోనివ్వటం లేదని సంబంధిత అధికారులకు కొందరు బాధితులు ఫిర్యాదులు చేశారు. ఈ బిట్స్ దగ్గర ఉన్న పేదల కాలనీ వద్ద ఉన్న ఖాళీ స్థలాల్లో ఇళ్లను నిర్మించుకోవటానికి రావటం, కొందరు అడ్డుకోవటం తూంకుంట మున్సిపల్ అధికార పార్టీ నాయకుల మధ్య నెలకొన్న గ్రూపు రాజకీయాలతో అసలైన లబ్దిదారులకు కొంత వరకు అన్యాయం జరుగుతుందన్న విమర్శలు కూడ వ్యక్తం అవుతున్నాయి. ఇదీ ఇలా ఉండగా అంతాయిపల్లిలోని గ్యాప్ ఏరియాలో ప్రభుత్వం పట్టా సర్టిఫికెట్లు ఇచ్చినట్లుగా ఫేక్ ఇళ్ల సర్టిఫికెట్స్ కూడ తయారు చేస్తున్నారని విక్రయిస్తు డబ్బులు దండుకుంటున్నారని పలువురు నాయకులు, స్థానికులు ఒకరిపై మరొకరు కొందరు పరస్పర విమర్శలు చేసుకుంటున్నారు. కొందరు ప్లాట్లు అమ్ముకుంటూ లబ్ధిపొందుతున్నారన్న విమర్శలు కూడ వ్యక్తం అవుతున్నాయి. దీంతో ఇళ్లపట్టాల, ఇళ్ల నిర్మాణాల విషయంలో నాయకుల, స్థానికుల, మధ్యవర్థుల, లబ్దిదారుల మధ్య విభేదాలు ఏర్పడి మనస్పర్ధలు పెరుగుతూ భగ్గుమంటున్నాయి.

## ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం

**మేడ్చల్, డిసెంబరు 5, ప్రభాతవార్త:** మెడిసిటీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఘనపూర్-మేడ్చల్‌లో ప్రపంచ ఎయిడ్స్‌డే సందర్భంగా వారం రోజుల పాటు జరిగిన అవగాహన కార్యక్రమాలు ముగిశాయి. శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్‌డే అవగాహణ కార్యక్రమాలు నిర్వహించి ముగించారు. కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో వారం రోజుల పాటు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. డిసెంబరు 1వ తేదీ నుంచి జరిగిన ఈ కార్యక్రమంలో ఎంబిబిఎస్ విద్యార్థులకు ముగ్గుల పోటీలు, పిజి విద్యార్థులకు పోస్టర్ ప్రదర్శన, ఎయిడ్స్ నిరోధకంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్స్ నిర్వహించారు. గైనకాలజిస్ట్ విభాగం పిజి విద్యార్థులు డాక్టర్ కల్పన నేతృత్వంలో గర్భిణీ స్త్రీలకు ఎయిడ్స్ సోకినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్కిట్ ప్రదర్శించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కమ్యూనిటీ మెడిసిన్ విభాగం హెచ్ఓడి డాక్టర్ (బ్రిగ్) లియో ఎస్ వాజ్ మార్గదర్శకత్వంలో పిజి విద్యార్థులు స్వప్న, రీనా, మనోజ్ తెలంగాణలో ఎయిడ్స్ పరిస్థితితులు నివారణ చర్యలను వివరించారు. అల్వాల్ పిహెచ్‌సి డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ శైలజ, డాక్టర్ హేమలత, పిజి వైద్యులు డాక్టర్ సరిత, డాక్టర్ స్వప్న కలిసి రోగులకు కరపత్రాలను పంపిణీ చేసి అవగాహణ కల్పించారు. దీనికి సమన్వయకర్తగా డాక్టర్ హేమలత, అసోషియేట్ ప్రొఫెసర్, కమ్యూనిటీ మెడిసన్‌గా పనిచేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దేవేంద్రసింగ్ నేగి (ప్రిన్సిపల్), డాక్టర్ శైలేంద్ర వైస్‌ప్రిన్సిపల్, డాక్టర్ గీత మెడికల్ డైరక్టర్, పలువురు పాల్గొన్నారు.

## సామూహికంగా వందేమాతరగీతం ఆలాపన

**మేడ్చల్, డిసెంబరు 5, ప్రభాతవార్త:** వందేమాతర గీతం రచించి 150సంవత్సరాలు గడుస్తున్న సందర్భంగా మేడ్చల్‌లో సకల జనులతో వందేమాతర గీతాన్ని ఆలపించాలని, మేడ్చల్ నగర వందేమాతర కమిటీ ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి ఆలయంలో వందేమాతరగీతంను సామూహికంగా పాడారు. ఈ సందర్భంగా నిర్వాహక కమిటీ సుధాకర్‌రెడ్డి, మురళిధర్‌గుప్తాలు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యానికి ప్రేరణగా మంత్రంగా పనిచేసిన వందేమాతర గీతాన్ని రచించి 150సంవత్సరాలు గడుస్తున్నందున ప్రతి పౌరుడు దేశం కోసం నిస్వార్థంగా పనిచేయాలని దేశాభివృద్ధికి పాటు పడాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ నిర్వాహకులు తాళపల్లి రాజేశ్వర్, గురుస్వామి, పెంజర్ల మల్లేశ్‌యాదవ్, స్వామి కుర్మా, అవినాశ్‌గౌడ్, రఘురంపటేల్, లక్ష్మణ్, ప్రభు, కె.వంశీ, జె.బాబురాజ్, తదితరులు పాల్గొన్నారు.

## స్నేహితుడి మృతి... పోలీసులకు ఫిర్యాదు

**మొయినాబాద్, డిసెంబరు 5, ప్రభాతవార్త:** స్నేహితుడు మృత్తి చెందడంతో పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది, ఆకాష్ పోదర్, ఇచ్చినఫిర్యాదు మేరకు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మొయినాబాద్ మున్సిపాలిటిలోని చిల్కూర్ గ్రామంలోని కల్పతరు ప్రాజెక్ట్స్ ఇంటర్ లిమిటెడ్ కెపిఐఎల్, లో పనిచేస్తున్న రోహిత్ మండల్(22) ఉత్తరప్రదేష్, రాష్టం, పిల్విత్ జిల్లా, మలకలాని పోస్ట్ గగ్రోలాకు చెందిన రాజు మండల్ కుమారుడు, తేది 5.12.2025 గదిలో ఉరివేసుకుని మృత్తి చెందిన ఘటన చోటుచేసుకుంది. సుమారు ఒక నెల క్రితం వారు తమ స్వగ్రామం నుండి కల్పతరు ప్రాజెక్ట్స్ ఇంటర్ లిమిటెడ్‌కు జీవనోపాదికొరకు చిల్కూర్‌కు వచ్చారు. శుక్రవారం సుమారు 13 గంటల సమయంలలో భోజనానికి వచ్చి తిరిగి 14 గంటలకు పనికి వెళ్లే సమయంలో వారి సహోద్యోగి రోహిత్ మండల్ రాలేదని గమనించి వెంటనే అతడు వారి గదికి వెళ్లి చూసే సరికి గది తలుపులు తాళం వేసి ఉన్నట్లు గుర్తించారు, కిటికి ద్వారా లోపలికి చూడగా రోహిత్ మృతుడు ఎరుపు లుంగితో సీలింగ్‌ఫ్యాన్‌కు ఉరివేసుకున్నట్లు కనిపించింది వెంటనే సెక్యూరిటికి సమాచారం ఇచ్చి తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా రోహిత్ అప్పటికి మృతిచెందాడు, ఈ విషయంలో పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## బైక్‌స్కిడ్ అయి రైతుమృతి

**మొయినాబాద్, డిసెంబరు 5, ప్రభాతవార్త:** బైక్‌స్కిడ్ అయి రైతు మృత్తి చెందిన సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మంగ మమతా భర్త మల్లేష్, ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఎల్కగూడ గ్రామానికి చెందిన మంగా మల్లేష్(38) అనే రైతు తేది 26.11.2025 సుమారు రాత్రి 21 గంటల సమయంలో టిఎస్.12.ఈపి.2176 అనే బైక్ పై వీరన్నపేట్ నుండి ఎల్కగూడ వైపు వెళ్తుండగా తమ పొలంవద్దకు చేరుకున్న సమయంలో బైక్‌స్కిడ్ అవడంతో కిందపడిపోయి రక్తగాయాలయ్యాయి చికిత్స కోసం వెంటనే భాస్కర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఒలివ్ ఆసుపత్రికి మార్చారు. తేది 5.12.2025 ఉదయం 2 గంటలకు చికిత్స పొందుతున్న సమయంలో ఆమె భర్త మరణించినట్లు తెలిపారు. ఇట్టి విషయంపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## బస్ స్టాప్‌ను ప్రారంభించిన డిసిపి రాహుల్ హెగ్డే

**అల్వాల్, డిసెంబరు 5 ప్రభాతవార్త:**
అల్వాల్ సత్య కాంప్లెక్స్ వద్ద నూతనం గా ఏర్పాటు చేసిన బస్ స్టాప్‌ను నార్త్ జోన్ డిసిపి రాహుల్ హెగ్డే గురువారం ప్రారంభించారు.
ఈ సేవ కేంద్రం కూడలి నుంచి సత్య కాంప్లెక్స్‌కు బస్ స్టాప్‌ను మార్చినట్లు డిసిపి పేర్కొన్నారు. ట్రాఫిక్ సమస్యలు తీర్చడంలో బాగంగా ఈ చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ప్రయాణికులు మార్పును గమనించి ఆర్టీసీతో పాటుగా ట్రాఫిక్ విభాగానికి సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎసిపి శంకర్ రాజు, సిఐ సర్దార్ నాయక్ హకీంపేట్ బస్ డిపో మేనేజర్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యం

### బుయ్యని శ్రీనివాస్ రెడ్డి

**కుల్కచర్ల, డిసెంబరు 5, ప్రభాతవార్త:** గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని అర్‌బిఎల్ సిఈఓ బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తిరుమలాపుర్ కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి వార్ల మాధవి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొని అధికారులకు నామినేషన్ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్బంగా అర్‌బిఎల్ సిఇఒ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ..ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, గ్రామానికి మరింత అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు పి. వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.


అధికారులకు నామినేషన్ పత్రాన్ని అందజేస్తున్న సర్పంచ్ అభ్యర్థి వార్ల మాధవి

# మత్తులో ఆర్టీసీ డ్రైవర్ పై దాడి

### ముగ్గురు యువకులకు రిమాండ్

**ఆమనగల్లు, డిసెంబరు 5, ప్రభాతవార్త:** మద్యం, గంజాయి మత్తులో ముగ్గురు యువకులు ఆర్టీసీ బస్సును అడ్డగించి, డ్రైవర్‌తో పాటు ప్రయాణికులపై దాడి చేసినారు. ముగ్గురు యువకులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన ఆమనగల్ పోలీస్ స్టేషన్లో నమోదు అయ్యింది. ఆమనగల్లు ఎస్సై బి వెంకటేష్ కేసుకు సంబంధించిన వివరాలను విలేకరులకు వెల్లడించారు. ఆమనగల్లు పట్టణానికి చెందిన బొల్లు పవన్, చింతలపల్లి గ్రామానికి చెందిన గణేష్, తుపాకుల సూరి అనే ముగ్గురు యువకులు గురువారం సాయంత్రం మద్యం గంజాయి మత్తులో ఆమనగల్లు బస్టాండ్‌లో బస్సును అడ్డగించి డ్రైవర్‌తోపాటు పలువురు ప్రయాణికుల మీద దాడికి పాల్పడ్డారు. దీంతో బాధితులు100 నెంబర్‌కు ఫిర్యాదు చేయగా వెంటనే పట్టణంలో పెట్రోల్ నిర్వహిస్తున్న పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని అలజడి సృష్టిస్తున్న ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకొని, డ్రైవర్ ఫిర్యాదు మేరకు ఆర్టీసీ డ్రైవర్ విధులకు ఆటంకం కల్పించడంతోపాటు దాడి చేసినట్లు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసినట్లు ఆయన తెలిపారు. అదుపులోకి తీసుకున్న ముగ్గురు యువకులను శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై బి వెంకటేష్ తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగిస్తే కేసులు నమోదు చేసుకుని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.


రిమాండ్‌కు తరలించిన యువకులు


హస్తకళా ప్రదర్శనను పరిశీలిస్తున్న మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పావని జంగయ్యయాదవ్

## సిజిసిలో ఆకట్టుకున్న హస్తకళా ప్రదర్శన

**ఘట్‌కేసర్, డిసెంబరు 5, ప్రభాతవార్త:** విద్యార్థులలో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు టీచర్లు చొరవ చూపాలని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ అన్నారు. జిహెచ్ఎంసీ ఘట్‌కేసర్ సర్కిల్ ఘణాపూర్‌లోడ్డులోని చైల్డ్ గైడెన్స్ సెంటర్‌లో హస్తకళా ప్రదర్శన నిర్వహించారు. ఘట్‌కేసర్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ విచ్చేసి ప్రదర్శనను తిలకించి విద్యార్థులతో మాట్లాడారు. వివిధ రకాల హస్తకళా పరికరాలను ఆమె చూసి పిల్లలను అభినందించి బిస్కెట్లు, చాకెట్లు పంపిణీ చేశారు. మానసిక, శారీరక దివ్యాంగులైన పిల్లలను చదువు, ఆటల్లో ప్రోత్సహించాలని ఆమె సూచించారు. ఈకార్యక్రమంలో ఘట్‌కేసర్ ఎస్ఐ షేక్ హీనా, మాజీ కౌన్సిలర్ కడుపొల్ల మల్లేశ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క సంజీవరెడ్డి, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మైసమ్మగుట్ట అండర్‌పాస్‌పై ఎంపీ లక్ష్మణ్ లేఖ అందజేత

### -స్థలంపై అఖిలపక్షం, కాలనీవాసుల విజ్ఞప్తి

**ఘట్‌కేసర్, డిసెంబరు 5, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ బైపాస్ రహదారిలో నిర్మిస్తున్న మైసమ్మగుట్ట అండర్‌పాస్ వంతెన ముందు కేటాయించిన స్థలంలోనే పనులు చేపట్టాలని రాజ్యసభ సభ్యులు డాక్టర్ కోవ లక్ష్మణ్ జాతీయరహదారుల ప్రాజెక్టు సంచాలకులు (పిఐయు)కు లేఖ రాశారు. జాతీయ రహదారి (163)లో అఖిలపక్ష నాయకులు, మైసమ్మగుట్ట కాలనీవాసులు, హస్టల్ విద్యార్థులు చేసిన విజ్ఞప్తి మేరకు మైసమ్మగుట్టకాలనీ చౌరస్తా వద్దనే అండర్‌పాస్ వంతెన నిర్మాణం చేయాలని రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్ వరంగల్‌లోని పిడి కార్యాలయానికి లేఖ పంపగా ఘట్‌కేసర్ నాయకులు హనుమకొండ లోని ఎన్‌హెచ్ఏఐ కార్యాలయంలో వెళ్లి అంద జేశారు. ఘట్‌కేసర్ మున్సిపల్ బీఆర్ఎస్, బిజెపి అధ్యక్షులు బండారి శ్రీనివాస్‌గౌడ్, కొమ్మిడి మహిపాల్‌రెడ్డి, సహకార సంఘం మాజీ చైర్మన్ డొంకెన బిక్షపతిగౌడ్, మాజీ ఎంపిటిసి మేకల నర్సింగ్‌రావు, దీకొండ రఘులు పాల్గొన్నారు. ఈసందర్భంగా నాయకులు ఎంపీలు కోవ లక్ష్మణ్, ఈటల రాజేందర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.


ఎన్‌హెచ్ఎఐ కార్యాలయంలో ఎంపీ లేఖను అందజేస్తున్న ఘట్‌కేసర్ నాయకులు

# నామినేషన్ క్లస్టర్‌లను పరిశీలించిన అదనపు కలెక్టర్


నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సుధీర్

**దోమ, డిసెంబరు 5, ప్రభాతవార్త:** గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల సందర్భముగా శుక్రవారం నాడు వికారాబాద్‌జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, ట్రేని కలెక్టర్ హర్షచౌదరి నామినేషన్ కేంద్రాలను పరిశీలించారు. సర్పంచ్, వార్డు మెంబర్లకు నామినేషన్ వేస్తున్న వ్యక్తుల దర ఖాస్తు పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సిబ్బందికి సూచించారు. నామినేషన్ వేస్తున్న వ్యక్తులకు సంబంధించిన వారు గుంపులుగా రాకుండ చూడాలని తెలియజేశారు. దోమ మండలములో జరిగే పంచాయతీ సర్పంచ్, వార్డుఎన్నికల నేపథ్యములో అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఇప్పటి వరకు ఎన్ని నామినేషన్‌లు వచ్చాయని 04.12.2025 వరకు 36 పంచాయతీలకు గాను 70 సర్పంచ్ నామినేషన్‌లు, 308 వార్డులకుగాను 04.12.2025 నాటికి 230 నామినేషన్‌లు వచ్చినట్లు జిల్లా అధికారులకు తెలియజేశారు. ఈ సందర్భముగ దోమ, బోంపల్లి క్లష్టర్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమములో ఎంపిడిఓ గ్యామా, ఆర్ఓ మల్లేశ్వర్, డిప్యూటి తహసిల్దార్ నర్సిములు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో పోలీసుల రూట్ మార్చ్

..బెదిరింపులు గొడవలు సహించేదిలేదు
..మద్యం, డబ్బు పంపిణీ నిషేధించబడ్డాయి
..శాంతి భద్రతలు కాపాడేందుకు ప్రత్యేక బృందాలు
..మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ రెడ్డి



**మొయినాబాద్, డిసెంబరు 5, ప్రభాతవార్త:** మొయినాబాద్ మండలంలోని కేతిరెడ్డిపల్లి, అమ్డాపూర్, శ్రీరామ్‌నగర్ గ్రామాల్లో ఇన్స్పెక్టర్ పవన్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో రూట్ మార్చ్ నిర్వహించారు. గ్రామ పంచాయితీ ఎన్నికలు 2025 ను దృష్టిలో ఉంచుకొని మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలు సమగ్రంగా కొనసాగేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అభ్యర్థులతో పవన్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రజలు భయభ్రాంతులకు గురికాకుండా ఎన్నికలను స్వేచ్ఛగా శాంతి యుతంగా నిర్వహించేందుకు పోలీసులు అన్ని రకాల భద్రతా ఏర్పాట్లు చేపట్టారన్నారు. గ్రామాల్లో పర్యటన చేస్తూ ప్రజలకు చట్టం చేతిలో ఉందని అక్రమ కార్యాకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్స్పెక్టర్ పవన్‌కుమార్ రెడ్డి హెచ్చరిక జారిచేశారు. ఎన్నికల్లో బెదిరింపులు గుంపుల గొడవలు సహించబోమని గుర్తుచేశారు. మద్యం పంపిణీ డబ్బు పంపిణీ ఇతర అక్రమ ప్రయోజనాలు పూర్తిగా నిషేధించ బడ్డాయని గుర్తుచేశారు. శాంతి భద్రతకు విఘుతం కల్పిస్తే ఎంతటివారినైనా వదిలేదిలేదని, శాంతియుతంగా ఎన్నికలు జరుపుకోవాలని తెలిపారు.

# గెలుపు దిశగా కార్యకర్తలు పని చేయాలి

### ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

**కుల్కచర్ల, డిసెంబరు 5, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులను ఆశీర్వదించి గెలిపించాలని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండలకేంద్రంతో పాటు, కుసుమసముద్రం, బండవెల్కిచర్ల, తదితర గ్రామాలల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలుపుదిశగా ప్రతి నాయకుడు, కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు ప్రజల్లోకి తీసుకెళ్ళాలి అన్నారు. అధికార పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే పనులు గ్రామాల్లో మరింతగా వేగవంతంగా జరుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు భీంరెడ్డి, మార్కెట్‌కమిటి ఛైర్మన్ ఆంజనేయులు, పాంబండ ఆలచ ఛైర్మన్ కోట్ల మహిపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

# ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల రికార్డులు స్వాధీనం

**ఘట్‌కేసర్, డిసెంబరు 5, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల రికార్డులను జిహెచ్ఎంసీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎల్‌బి నగర్ జోన్‌లో ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీలు విలీనం చేయడంతో అధికారులు మున్సిపల్ కార్యాలయాలపై బోర్డు మార్చి వేసి జిహెచ్ఎంసీ ఘట్‌కేసర్ సర్కిల్, పోచారం సర్కిల్ కార్యాలయాలుగా బోర్డు ఏర్పాటు చేయించారు. విలీనమైన పురపాలక సంఘాల నుంచి రికార్డులు స్వాధీనం చేసుకోవాలని జిహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వి. కర్ణన్ ఆదేశించడంతో జోనల్ అధికారులు చర్యలు చేపట్టారు. ఈమేరకు ఎల్‌బినగర్ జోనల్ కమిషనర్ (మానిటరింగ్ అధికారి) హేమంత్ కేశవ్ పాటిల్ పర్యవేక్షణలో ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ రాజు ఘట్‌కేసర్ చేరుకొని మున్సిపల్ కార్యాలయంలో ఎంసీ కమిషనర్ పంజాల రాజేశ్‌గౌడ్‌తో సమావేశమై రికార్డులపై అప్పగింతపై చర్చించారు. మున్సిపాలిటీకి సంబంధించిన అన్ని రకాల రికార్డులను కమిషనర్ రాజేశ్ డీసీ రాజుకు అప్పగించారు. ఎల్‌బినగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ పర్యవేక్షణలో ముషీరాబాద్ డిప్యూటీ కమిషనర్ రామాంజులరెడ్డి పోచారం రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్ ఆర్థిక, అనుమతుల పరమైన రికార్డులను డీసీకి అప్పగించారు. దీంతో యుఎల్‌బిల పాలన నుంచి రెండు మున్సిపాలిటీలు హైదరాబాద్ మహానగర పాలక సంస్థ పరిధిలోకి వెళ్లాయి.


జిహెచ్ఎంసీ ఉప్పల్ డీసీ రాజుకు రికార్డులు అప్పగిస్తున్న కమిషనర్ రాజేశ్

## రాజస్థానీ మహిళ అదృశ్యం

**ఘట్‌కేసర్, డిసెంబరు 5, ప్రభాతవార్త:** ఇంటి నుంచి వెళ్లిన మహిళ అదృశ్యమైన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రాజస్థాన్‌కు చెందిన లవకుశ ప్రజాప్రతి (23) ఎనమిది నెలల క్రితం తన భార్యతో కలిసి బ్రతుకు దెరువు కోసం ఘట్‌కేసర్ వచ్చాడు. ఎదులాబాద్ రోడ్డులోని కనకదుర్గ వైన్స్ వెనుక ఉంటూ మార్బుల్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 4న లవకుశ ప్రజాప్రతి ఉదయం 8 గంటలకు పనిమీద బయటకు వెళ్లగా మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూడగా తన భార్య ఐనానీతు ప్రజాప్రతి (20) కనించకపోవడంతో అంతటా వెతికినా ఫలితం లేకపోగా గురువారం ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు మహిళ మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని ఘట్‌కేసర్ ఎస్ఐ బి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.


ఐనానీతు ప్రజాపతి



సిజిసీ విద్యార్థులతో కేపీఆర్ఐటీ డైరక్టర్ సుధీర్‌ప్రేమ్‌కుమార్ తదితరులు

# దివ్యాంగుల పట్ల ఆదరణను పెంచాలి

**ఘట్‌కేసర్, డిసెంబరు 5, ప్రభాతవార్త:** వికలాంగుల సామాజిక సమగ్రీకరణపై అవగాహన కల్గిఉండాలని కేపీఆర్ఐటీ డైరక్టర్ ప్రొఫెసర్ బి.సుధీర్‌ప్రేమ్‌కుమార్ అన్నారు. జిహెచ్ఎంపీ ఘట్‌కేసర్ సర్కిల్ ఘణాపూర్‌రోడ్డులోని చైల్డ్‌గెడెన్స్ సెంటర్‌ను శుక్రవారం కేపీఆర్ఐటీ బృందం సందర్శించింది. సెంటర్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక హస్తకళల ప్రదర్శనను కేపీఆర్ఐటీ డైరక్టర్ సుధీర్‌ప్రేమ్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శ్రీనాధ్‌కాశ్యప్, పీఆర్ఓ కె.మదన్‌మోహన్‌లు ప్రదర్శనను తిలకించి విద్యార్థులతో మాట్లాడారు.

దివ్యాంగుల జీవన విధానం, వారి ప్రతిభ, అవసరాలు, సామాజిక సమగ్రీకరణపై అవగాహన పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన కార్యక్రమాలను వారు పరిశీలించారు. సమాజంలో వికలాంగుల పట్ల ఆధరణనఉ మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని, విద్యార్థులు ఇలాంటి ప్రత్యేక కేంద్రాలను సందర్శించి అవగాహన పొందడం మాత్రమే కాకుండా అవసరమైన స్వచ్ఛంధ సేవలను అందించడం ద్వారా సమాజానికి ఉపయోగపడాలని ఆయన అన్నారు. కేపీఆర్ఐటీ చైర్మన్ కొమ్మూరి ప్రతాపరెడ్డి, వైస్‌చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి, కార్యదర్శి కొమ్మూరి రాకేశ్‌రెడ్డిలు చైల్డ్‌గెడెన్ సెంటర్‌ను సందర్శించి అవసరమైన వాలీంటర్ సేవలు అందించేందుకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు డైరక్టర్ తెలిపారు. పిల్లల, వికలాంగుల శ్రేయస్సు సాధనలో కేపీఆర్ఈఎస్ ద్వారా మరొక అడగు ముందుకు పడినట్లయ్యింది.

## 7న నగరానికి రానున్న దీదీ కృష్ణకుమారి



హైదరాబాద్, డిసెంబరు 5 ప్రభాతవార్త: మానవతావాది, ఆధ్యాత్మిక నాయకురాలు దీదీ కృష్ణకుమారి ఈనెల 7వ తేదీన నగరాన్ని సందర్శించనున్నారు. ఆదివారం సాయంత్రం 5:30 నుండి 7:30 వరకు సికింద్రాబాద్ సిక్ విలేజ్ గల ఇంపీరియల్ గార్డెన్స్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దీదీ కృష్ణకుమారి ప్రసంగిం చనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రవేశం ఉచితమని, ఆసక్తి కలిగిన వారు సంస్థ క్యూర్ కోడ్ ద్వారా నమోదు చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సాధు వాస్వానీ మిషన్ ట్రస్టీలు డాక్టర్ హరీష్ మీర్ చందని, హీరా రూపానీలు కాచిగూడ వారి కార్యాలంలో జరిగిన విలేఖరుల సమావేశంలో తెలిపారు. ఈ కార్యక్రమం విద్యార్థులు, నిపుణులు, గృహిణులు, విద్యావేత్తలు, ఆధ్యాత్మిక ఆకాంక్షకులు, విస్తృత సమాజంలోని ఇతర సభ్యులందరినీ ఆకర్షిస్తుందని భావిస్తున్నామన్నారు. ప్రతి వ్యక్తి, నేపథ్యం, పరిస్థితితో సంబంధం లేకుండా, అంతర్గత అవగాహన, ఆత్మవిశ్వాసం, క్షమ, కరుణతో కూడిన జీవనం ద్వారా వారి విధిని ఎలా పునర్ రూపకల్పన చేసుకోవాలనే అంశాలపై దీదీ కృష్ణకుమారి తన ప్రసంగంలో తెలియజేస్తారని వారు వివరించారు. ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించే ఈ కార్యక్రమంలో సభికుల ఎంపికలు, ఆలోచనలు, అంతర్గత వైఖరులు వారి జీవిత గమనాన్ని ఎలా రూపొందిస్తాయో అన్వేషించడానికి ఈ కార్యక్రమంలో పాల్గొనాలని వారు కోరారు. ప్రజలందరి జీవితాల పట్ల గౌరవం, అహింస, సేవ, క్షమాపణ, మత సామరస్యం అనే సందేశం, క్షమాపణ, శాంతి, కరుణ కోసం ప్రపంచ ప్రచారం దీదీ కృష్ణ కుమారి లక్ష్యయమని వారు వివరించారు.

### బ్యాంకుల విలీనం వల్ల ప్రజలకు ప్రయోజనం లేదు : వీఎస్ బోస్

సైఫాబాద్, డిసెంబరు 5 ప్రభాతవార్త: దేశంలో బ్యాంకులు విలీనం చేయడం వల్ల ప్రజలకు జరిగే మేలు, లాభం చెప్పకుండా బ్యాంకులను విలీనం చేసి 4 పెద్ద బ్యాంకులుగా మార్చి ప్రపంచంలో ఇతర దేశాలతో పోటీపడతానని చెప్పడం ప్రధాని నరేంద్రమోదీ మోసపూరిత వ్యాఖ్యలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఎస్.బోస్ విమర్శించారు. కార్పోరేట్ సంస్థల పరపతి, అవకాశాలు పెంచడానికి వారికి అనుకూలంగా బ్యాంకులు పనిచేసేలా చేయడమే మోదీ ప్రధాన ఉద్దేశమన్న విషయాన్ని ప్రజలు గమనిసున్నారని ఆయన హెచ్చరించారు. 4 పెద్ద బ్యాంకులు ఏర్పాటు చేయడం మూలంగా ప్రజలు దాచుకున్న డబ్బులకు వడ్డీ పెరుగుతుందా? లేక కార్పోరేట్ సంస్థలు ఒకే సారి వారికి కావాల్సిన అధిక మొత్తంలో అప్పు లభించే సౌలభ్యం ఈ పెద్ద బ్యాంకుల ద్వారా వస్తుందన్న విషయాన్ని మోదీ తెలియజేయాలని డిమాండ్ చేశారు. 4 పెద్ద బ్యాంకు ఏర్పాటు పేరుతో అన్ని బ్యాంకుల విలీనం చేయడం దేశ ఆర్థిక వ్యవస్థకు నష్టదాయకమన్నారు. 4 పెద్ద బ్యాంకుల ఏర్పాటు నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజలు మోదీకి తగిన గుణపాఠం చెపుతారని బోస్ హెచ్చరించారు.

## తక్షణమే తెలంగాణ ప్రజలకు పవన్ కల్యాణ్ క్షమాపణ చెప్పాలి

సైఫాబాద్, డిసెంబరు 5 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్‌లోని కోనసీమలో కొబ్బరి చెట్లు ఎండిపోవడానికి తెలంగాణ వారి కను దృష్టి తగిలిందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అవాకులు, చవాకులు పెలడాన్ని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎ) తెలుగు రాష్ట్రాల చీఫ్ కో-ఆర్డినేటర్ టి.పద్మారావు, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాదారం వినయ్‌కుమార్ తీవ్రంగా ఖండించారు. తక్షణమే పవన్‌కల్యాణ్ తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు. పవన్ వ్యాఖ్యలు రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల మధ్య వైషమ్యాలు రేపే విధంగా ఉన్నాయని, అంతేకాకుండా రెండు రాష్ట్రాలలో శాంతి భద్రతలకు భంగం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఈ వ్యాఖ్యలు అతని అవగాహనా రాహిత్యానికి, మూర్ఖత్వానికి నిదర్శనమని, రాష్ట్రంలో తాను ఉంటున్నానని, ప్రభుత్వంలో కూడా భాగస్వామినని చెప్పుకోవడానికి, తన ఉనికిని చాటుకోవడానికి అప్పుడప్పుడు ప్రత్యేకంగా విమానాల్లో తిరగడానికి, తన లక్ష పుస్తకాల అజ్ఞానాన్ని ప్రదర్శించుకోవాలనుకుంటే ప్రదర్శించుకోవచ్చునని, అంతే కాని ఈ విధమైన వ్యాఖ్యలు చేయడం తెలుగు రాష్ట్రాల ప్రజల మనోభావాలు కించపరిచేలా చేయరాదని వారు హెచ్చరించారు. తక్షణమే తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు.

### తంజావూరు ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌లో వర్క్‌షాప్ ప్రారంభం

సైఫాబాద్, డిసెంబరు 5 ప్రభాతవార్త: హిమాయత్‌నగర్‌లోని సిరి ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెయింటింగ్‌లో మహిళల కోసం ప్రత్యేకంగా తంజావూరు ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌లో రెండు రోజుల పాటు జరిగే వర్క్‌షాప్ శుక్రవారం ఉదయం ప్రారంభోత్సవం జరిగింది. ఈ వర్క్‌షాప్‌ను ఫెద్లయిట్ కంపెనీ నిపుణురాలు ఇందిరా, సీనియర్ పెయింటింగ్ ఆర్టిస్ట్ శ్రీపతి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిరి ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెయింటింగ్ డైరెక్టర్ స్వామి మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా ఔత్సాహికులకు ప్రత్యేకంగా వర్క్‌షాప్ నిర్వహించడం జరిగిందన్నారు. తమ వర్క్‌షాప్‌లో శిక్షణ పొందిన మహిళలు సొంతంగా పెయింటింగ్ వేసుకుంటున్నారని, ఆనేక మంది స్వయంగా పెయింటింగ్ సెంటర్‌లను ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. ప్రముఖ పెయింటింగ్ ఆర్టిస్టులచే ఔత్సాహికులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. శనివారం కూడా వర్క్ షాప్ కొనసాగుతుందన్నారు.

## విద్యార్థి దశ నుంచే చురుకుగా ఉండాలి

అఫ్జల్‌గంజ్, డిసెంబర్ 5ప్రభాతవార్త:



కలెక్టర్ దాసరి చందన నుంచి సర్టిఫికెట్ అందుకున్న విద్యార్థి

నగరంలోని వేర్వురు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన174 మంది విద్యార్థులు పాల్గొన్నగా, అందులో అఫ్జల్‌గంజ్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిచదువుతున్న శృజన్ కుమార్ సొంతంగా తాళం లేకుండా తలుపు తెరవడానికి ఫుట్ ఫెడల్ పరికరంతో తలుపును తయారు చేశారు. 18 మంది విజేతలను ఎంపి క చేయగా అందులో అఫ్జల్‌గంజ్ఉన్నత పాఠశాలకు చెందిన శృజన్ కుమార్‌ను సైన్స్ ఉపాధ్యాయులు బల్వంత్‌రెడ్డి అభినందించారు. ఆయన చేతుల మీదుగా సర్టిఫికెట్‌ను అందుకున్నారు. విద్యార్థులు పలు అంశాల్లో వివిధ రకాలైన సమూనాలను రాష్ట్ర స్థాయి పోటీల కు, జాతీయ స్థాయికి పంపిస్తామన్నారు.



మాజీ రాజ్యసభ్యులు వి.హనుమంత్‌రావును సన్మానించిన కార్పొరేటర్ సున్నం

### విహెచ్‌ను సన్మానించిన కార్పొరేటర్ రాజ్‌మోహన్

బేగంబజార్, డిసెంబర్ 5ప్రభాతవార్త: ప్రభుత్వం అమలు చేసే అన్ని ఆర్థిక విధానాల అంతిమ లక్ష్యం మానవవాభివృద్ధియే దివంగత మాజీ ముఖ్యమంత్రి కొణిజెట్టి రోశయ్య ఆలోచనని మాజీ రాజ్యసభ్యులు వి.హనుమంత్‌రావు అన్నారు. కొటిజెటి రోశయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలోమాజీ రాజ్యసభ సభ్యులు వి.హన్‌మంత్‌రావును సన్మానించారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్ సున్నం రాజ్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## మాదిగ ఉన్నతాధికారులు, టాసా ఉపాధ్యక్షులకు సన్మానం

అత్తాపూర్ డిసెంబరు5, ప్రభాతవార్త : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయం పిజీడీన్ స్టడీస్ గా నియమితులైన డాక్టర్ కే బీ ఈశ్వరి, తెలంగాణ అగ్రికల్చరల్ సైంటిస్ట్ అసోసియేషన్ (టాసా) ఉపాధ్యక్షులుగా నియమితులైన డాక్టర్ జె కమలాకర్ లను శుక్రవారం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పిస్ ) నాయకులు, వివిధ పార్టీలలో ఉన్న మాదిగ నాయకులు కలసి శాలువా, పుష్ప గుచ్చాలతో ఘనంగా సన్మానించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో మాదిగ విద్యార్థులకు, ఉద్యోగులకు, అధ్యాపకులకు, కార్మికులకు ఉన్నతాధికారులు అండగా నిలవాలని కోరారు. అదే సమయంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, వివిధ పార్టీలలో ఉన్న మాదిగ నాయకులు వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పని చేస్తున్న మాదిగ సామాజిక వర్గాల అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి అండగా ఉంటారన్నారని తెలిపారు. విశ్వ విద్యాలయం మాదిగ సామజీక వర్గాలు అధికారులు, ఉద్యోగులు, కార్మికులకు ఎమ్మార్పిస్ నాయకులు ఎప్పుడు అండగా ఉంటారని ఎమ్మార్పిస్ రాష్ట్ర నాయకులు వనం నర్సింహ మాదిగ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర నాయకులు



వనం నరసింహ మాదిగ, క్యాసారం శంకర్ రావు మాదిగ, నాన్నగారి రామచందర్ మాదిగ, బీసీ ఎస్సీ ఎస్టీ చైతన్య వేదిక చైర్మన్ కె. హరినాథ్, కాంగ్రెస్ పార్టీ మైలార్ దేవుపల్లి డివిజన్ అధ్యక్షుడు నత్తి ధనుంజయ, సీనియర్ నాయకులు పలుగు చెరువు మహేష్, పి జీవన్ దాస్, అనుముల జాన్ పాల్, గోల్కొండ యాదయ్య, నవ జ్యోతి యూత్ క్లబ్ అధ్యక్షుడు మంగలారం శ్రీనివాస్, బీ ఆర్ ఎస్ నాయకులు ఎడ్ల కాడి సూర్యం, వీర్లపల్లి నవీన్ కుమార్, జర్నలిస్టు సంఘాల నాయకులు అప్పారెడ్డి గూడెం భీమయ్య, పి. వెంకటేష్, ఎం బాలసుబ్రమణ్యం, ఆరింట్ల విశాల్, సురేష్, రాధాకృష్ణ, వ్యవసాయ విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు ఎం రాజు లు పాల్గొన్నారు.

### రంగస్థల నటుడు రామశాస్త్రికి చాట్లశ్రీరాములు ప్రతిభా పురస్కారం : డా. కె.వి.రమణాచారి

నాంపల్లి, డిసెంబరు 5 ప్రభాతవార్త : ప్రఖ్యాత సాంస్కృతిక సంస్థ రసరంజని, చాట్ల శ్రీరాములు థియేటర్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో సుప్రసిద్ధ రంగస్థల ప్రయోక్త డా. చాట్ల శ్రీరాములు 94వ జయంతి వేడుకలను ప్రముఖ రంగస్థల నటుడు ఎన్.ఎస్.రామశాస్త్రికి చాట్ల శ్రీరాములు ప్రతిభా పురస్కారాన్ని ప్రదానం చేశారు. నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్దనున్న సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వ విద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళావేదికలో శుక్రవారం రాత్రి తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఆంధ్ర నాటక కళాపరిషత్ అధ్యక్షుడు బొల్లినేని కృష్ణయ్య ముఖ్య అతిథిగా విచ్చేసి ఆత్మీయ అతిథులు ప్రముఖ రంగస్థల ప్రయోక్త, దర్శకుడు డిఎస్ఎన్.మూర్తి, డా. డి.విజయ భాస్కర్, చాట్ల వెంకటరమణ తదితరులతో కలిసి ప్రముఖ రంగస్థల నటుడు ఎన్.ఎస్.రామశాస్త్రి దంపతులను ఘనంగా సత్కరించి ప్రతిభా పురస్కారం, 20వేల రూపాయల నగదు బహుమతిని ప్రదానం చేశారు. నాటకమే తపస్సుగా భావించే నాటకరంగ నిత్యసత్య కృషీవలులకు చంద్రుడికో నూలుపోగుగా సత్కారంచేసి



ప్రతిభా పురస్కారంతో రామశాస్త్రి దంపతులను సత్కరిస్తున్న రమణాచారి, కృష్ణయ్య, విజయభాస్కర్, రసరంజని కార్యవర్గం

గౌరవించాలన్న సంకల్పంతోనే ఆవిర్భవించిన చాట్ల శ్రీరాములు ట్రస్టు 1999 నుండి క్రమం తప్పకుండా ప్రతీ యేటా డిసెంబరు 5న ఒక నాటకరంగం విశిష్టునకు ప్రతిభా పురస్కారంతోపాటు 20వేల రూపాయలు ప్రదానంచేసే శిష్ఠ సంప్రదాయాన్ని నెలకొల్పి ఎందరికో చాట్ల శ్రీరాములు మార్గదర్శకులయ్యారని అధ్యక్షోపన్యాసంలో రమణాచారి పేర్కొన్నారు. సభానాంతరం శ్రీజయా ఆర్ట్స్ హైదరాబాద్ వారిచే మాడభూషి దివాకరబాబు రచన, బి.సాదినేని దర్శకత్వంలో రూపొందిన వన్ ప్లస్ వన్ నాటిక అద్భుతంగా ప్రదర్శింపబడి రంగస్థలప్రియులు, ఔత్సాహిక ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది.

## మోడీ సర్కార్ రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆందోళన

చిక్కడపల్లి డిసెంబర్ 5 (ప్రభాతవార్త ) : రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శుక్రవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద రైతు కూలి సంఘం ఆధ్వర్యంలో మోడీ సర్కార్ అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్యక్రమం నిర్వహించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు పట్లోళ్ల నాగిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెల్తురు సదానందం మాట్లాడుతూ శీతాకాల పార్లమెంట్ సమావేశల్లో పత్తి విత్తనచట్టాన్ని ఆమోదించడానికి మోడీ సర్కార్ కుట్రలు చేస్తుందని, ఈ చట్టం కార్పోరేట్ సంస్థల కు లాభం చీకురే విధంగా, రైతాంగానికి నష్టం కలిగించే విధంగా ఉందని విమర్శించారు. ఇప్పటికే వ్యవసాయరంగంలో కార్పొరేట్ సంస్థలైన మోనోశాంటో, సిజెంటా, టాటా తదితరుల ప్రవేశం వల్ల కల్తీవిత్తనాలు పెరిగిపోయాయని, పత్తివిత్తనచట్టంలో నకిలీ విత్తనాల తయారీ దారులపై ఎలాంటి చర్యలు ఉండబోవని, రైతులు నేటికీ కల్తీ విత్తనాల వల్ల ఆర్థిక బాధలతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. రైతు వ్యతిరేక చట్టాల అమలు కు ఇది నిదర్శనమన్నారు. పత్తి





నిరసన వ్యక్తం చేస్తున్న రైతు కూలి సంఘం ప్రతినిధులు

విత్తనాల చట్టం, విద్యుత్ బిల్లుల సవరణకు వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా (శీరీలీ )పిలుపు మేరకు 8 న పత్తి విత్తనచట్టం, విద్యుత్ సవరణాల చట్టం పత్రుల దగ్ధం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలనీ పిలుపు నిచ్చారు. ఈ ఆందోళన కార్యక్రమంలో రైతుకూలీ సంఘం రాష్ట్ర కోశాదికారి జి. వెంకటేశ్వర్ రావు, రాష్ట్ర కమిటి సభ్యులు, మండల యుగేందర్, బి . సత్తెన్న, బోనాల స్వామి, చంద్రం, రామచ్చేంద్రన్న, పాల్గొన్నారు.

### దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత : ఎమ్మెల్యే



హైమావతినగర్ శ్రీ షిరిడీసాయిబాబా వార్షికోత్సవ వేడుకల్లో పూజల్లో పాల్గొన్న జూబ్లీహిల్స్ శాసనసభ్యులు నవీన్ యాదవ్.

యూసుఫ్‌గూడ, డిసెంబర్ 5, ప్రభాతవార్త : దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని జూబ్లీ హిల్స్ శాసనసభ్యులు వి.నవీన్ యాదవ్ అన్నారు. మోతీనగర్ ప్రాంతంలోని హైమావతినగర్ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయ 12వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సాయిబాబాకు స్వరాభిషేకం, పంచామృత, ఫల, పుష్ప, సుంగధ ద్రవ్యాలతో బాబా వారికి అభిషేకం అర్చనలు మధ్యాహ్న హారతి భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకల్లో జూబ్లీహిల్స్ శాసనసభ్యులు వి.నవీన్ యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పల్లకి ఉత్సవం, పవలింపు సేవ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ జి.మణిక్‌రెడ్డి, ప్రముఖ వ్యాపారవేత్త కొండల్ రావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు దూడల రవీగౌడ్, గోవర్ధన్‌రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు గోపాలకృష్ణ, రాజిరెడ్డి, హనుమంతునాయుడు, శంకర్‌రావు, నరసింగ్‌రావు పాల్గొన్నారు.

### ఘనంగా స్వచ్ఛంద సేవకుల దినోత్సవం



జర్నలిస్టులు, పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న హైకోర్టు సీనియర్ న్యాయవాది జి.వి.ఎల్.నరసింహారావు, జీహెచ్ఎంసీ సర్కిల్ ఎంహెచ్‌వో డాక్టర్ హేమలత

హైదరాబాద్, డిసెంబరు 5 ప్రభాతవార్త: స్వచ్ఛందసేవలో చాలా సంతృప్తి ఉంటుందని హైకోర్టు సీనియర్ న్యాయవాది జి.వి.ఎల్.నరసింహారావు, జీహెచ్ఎంసీ అంబర్‌పేట సర్కిల్ ఎంహెచ్‌వో డాక్టర్ హేమలతలు అన్నారు. అంతర్జాతీయ స్వచ్ఛంద సేవకుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం సేవాయూత్. అసోసియేషన్ అధ్యకుడు రచ్చ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గోల్నాక డివిజన్ అశోక్‌నగర్‌లో సీనియర్ జర్నలిస్టులు లక్ష్మన్, రమేష్ లతో పాటు పారిశుధ్య కార్మికులను శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా హాజరైన వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల సేవలు వేలకట్టలేనవని, వారుచేసే సేవలు గొప్పసేవలని, సేవాయూత్ అసోసియేషన్ సేవకుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పారిశుధ్య కార్మికులను గుర్తించి సత్కరించుకోవడం సముచితమైనదని పేర్కొన్నారు. సేవాయూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రచ్చ శ్రీనివాస్ అందిస్తున్న సేవలను వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పురుషోత్తం, డాక్టర్ శివ, ఆధ్యాత్మికవేత బాబా చంద్రపాల్, అసోసియేషన్ ప్రతినిధులు కిషోర్ నేత, ప్రవీణ్ కుమార్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి విక్రయదారులు ముగ్గురు అరెస్టు

అల్వాల్, డిసెంబరు 5 ప్రభాతవార్త: గంజాయి సరఫరా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను అల్వాల్ పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివ రాలు ఈ విధంగా ఉన్నాయి. అల్వాల్ ఐస్ ఫ్యాక్టరీ రోడ్డు వద్ద గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. గురువారం సాయంత్రం తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. బ్యాగులను తనిఖీ చేయగా 8.50 కేజీలు గంజా యి దొరికింది. ఫతేనగర్‌కు చెందిన కళ్యాణ మధు (32), కీసర వాస్తవ్యుడైన కణ్యాణ రాజు (53), బాలానగర్‌కు చెందిన సురేష్(36)లు ఒరిస్సా రాష్ట్రం నుంచి గంజాయిని తీసుకుని వచ్చి నగరంలో విక్రయిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి కోర్టుకు రిమాండ్ చేశారు.

## చికిత్స పొందుతూ ఆర్టీసీ డ్రైవర్ మృతి

తార్నాక డిసెంబర్ 5 ప్రభాతవార్త : తార్నాక ఆర్టీసీ ఆసుపత్రిలో బస్సు డ్రైవర్ చికిత్స పొందుతూ ఆకస్మికంగా శుక్రవారం మరణించాడు. కాలికి గాయమైందని ఆస్పత్రిలో ఇటీవల చేరిన డ్రైవర్ కు మూడు రోజుల చికిత్స అందించిన అనంతరం అతను మరణించాడని వైద్యులు తెలిపారు. దీనిపై మృతుడి కుటుంబసభ్యులు, తోటి ఉద్యోగులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వైద్యుల నిరక్ష్యం కారణంగానే సతీశ్ ప్రాణాలు కోల్పోయాడని ఆరోపిస్తున్నారు. హైదరాబాద్ లోని పంజాగుట్టకు చెందిన సతీశ్ టీజీఎస్ ఆర్టీసీలో బస్సు డ్రైవర్ గా పనిచేస్తున్నారు. గత నెల నవంబర్ 30వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో సతీశ్ కాలికి గాయమైంది. దీంతో సతీశ్‌ను తార్నాకలోని ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ సతీశ్ కాలికి సిమెంట్ పట్టి వేసి చికిత్స అందించారు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో అకస్మాత్తుగా సతీశ్ చనిపోయాడని ఆస్పత్రివైద్యులు వెల్లడించారు. దీనిపై సతీశ్ కుటుంబసభ్యులు, తోటి ఉద్యోగులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం 10 గంటలకు డాక్టర్లు అన్ని పరీక్షలు చేసి ఎలాంటి సమస్య లేదని ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లారని, మధ్యాహ్నం 3 గంటల వరకు ఎన్ని సార్లు అడిగినా సమాధానం ఇవ్వలేదని కుటుంబసభ్యులు, తోటి కార్మికులు ఆరోపించారు. ఎందుకు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని వైద్యులను నిలదీయడంతో సతీశ్ చనిపోయాడని డాక్టర్లు చెప్పారని పేర్కొన్నారు. ఎలాంటి అనుభవం లేని డాక్టర్లతో ఆపరేషన్ చేయించడం వల్లనే సతీశ్ మృతిచెందాడని వారు ఆరోపించారు.

## 15న బిసిలకు జరిగిన అన్యాయాలపై రౌండ్ టేబుల్ సమావేశం

అఖిల భారత యాదవ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్

సైఫాబాద్, డిసెంబరు 5 ప్రభాతవార్త: బిసిల 42 శాతం రిజర్వేషన్‌లపై జరిగిన అన్యాయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్ళేందుకు, బిసిలకు మేలు జరిగేందుకు, చైతన్యవంతం చేసేందుకు ఈ నెల 15వ తేదీన ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని అఖిల భారత యాదవ్ మహాసభ అధ్యక్షుడు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు గడ్డం శ్రీనివాస్ యాదవ్ చెప్పారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో బిసి విద్యార్థి, యువజన సంఘాల నాయకులు, మేధావులు, ప్రొఫెసర్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొంటారని తెలిపారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తామని సిఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో బిసిలు ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఎంతో ఉత్సహపడ్డారని, తీరా రిజర్వేషన్‌లు అమలు జరగకపోవడంతో తీవ్రమైన నిరుత్సాహంతో కుంగిపోయారని విచారం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బిసిలను నట్టేట ముంచిందని, ఇటీవల ప్రధానినీ కలిసిన రేవంత్‌రెడ్డి బిసిల రిజర్వేషన్‌లపై నోరు



సమావేశంలో మాట్లాడుతున్న గడ్డం శ్రీనివాస్‌యాదవ్

మెదపకపోవడం దారుణమని, కాంగ్రెస్, బిజెపి ఈ రిజర్వేషన్ల విషయంలో కుమ్మక్కైనాయని ఆరోపించారు. రేవంత్‌రెడ్డికి బిసిలపై ప్రేమ ఉండే గ్రామ పంచాయితీ ఎన్నికల్లో బిసి అభ్యర్థులకే ఓట్లు వేసిగెలిపించమని కోరేవారని, సిఎం మాటలు ఒక విధంగా ఉంటే, చేష్టలు మరోక రకంగా ఉంటున్నాయని ధ్వజమెత్తారు. రౌండ్ టేబుల్ సమావేశాలు అన్ని విశ్వ విద్యాలయాల్లో నిర్వహిస్తామని, బిసిలంతా ఐక్యంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బిసి నాయకులు శ్రీనివాస్‌గౌడ్, సతీష్‌గౌడ్ పాల్గొన్నారు.

## పాలకుల కుట్రలకు బలైన సాయి ఈశ్వరాచారి : బాలరాజుగౌడ్

హైదరాబాద్, డిసెంబరు 5 ప్రభాతవార్త : బీసీ బిడ్డ సాయి ఈశ్వర చారి మరణం పాలకుల పాపమేనని బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాలరాజు గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈశ్వర చారి ఆత్మ బలిదానంపై చిక్కడపల్లి లోని రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో బిసి ఎస్సీ ఎస్టీ జెఎసి చైర్మెన్ విశారదన్ మహరాజ్, బిసి పొలిటికల్ ఫంట్ కన్వీనర్ అంబాల నారాయణగౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలరాజుగౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి కారణంగా బీసీ బిడ్డ ఆత్మబలిదానం చేయాల్సి వచ్చిందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయడం లేదని సాయి ఈశ్వర చారి బలిదానానికి సిద్ధపడ్డాడని ఆవేదన వ్యక్తం చేశారు. చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతూ ప్రాణాలు వదిలాడన్నారు. ఇది ముమ్మాటికి ప్రభుత్వ హత్య అని ఆరోపించారు. దీనికి మొదటి ముద్దాయి రేవంత్‌రెడ్డి మిగతా ముద్దాయిలు క్యాబినెట్ మంత్రులని ఆరోపించారు. బీసీ ప్రజా ప్రతినిధులు క్యాబినెట్ నుంచి రాజీనామ చేసి బయటికి రావాలి. లేని పక్షంలో బీసీ ద్రోహులుగా చరిత్రలో ములిగిపోతారు అని హెచ్చరించారు. సాయి ఈశ్వర చారికి



చిక్కడపల్లిలో మీడియాతో మాట్లాడుతున్న బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాలరాజుగౌడ్

భార్య, ముగ్గురు పిల్లలు, తల్లి ఉందని, ఆ కుటుంబానికి కోటి రూపాయలు ఆర్థిక సహాయం చేసి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తక్షణం పార్లమెంట్‌లో బిల్లు పెట్టి 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ యెలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్, వైస్ చైర్మన్ దుర్గయ్యగౌడ్, అంబాల నారాయణగౌడ్, బైర్ల శేఖర్, దామోదర్‌గౌడ్, నగేష్, బోయ గోపి, గడ్డమీద విజయ్, హర్షవర్ధన్, మధుసుధన్, నాగభూషణం పాల్గొన్నారు.

## దోపిడి కేసులో నలుగురు అరెస్ట్...రూ.34.66 లక్షలు స్వాధీనం

చార్మినార్, డిసెంబరు 5 ప్రభాతవార్త : హైదరాబాద్ పాతనగరంలో ఓ గాజుల వ్యాపారిని కత్తితో బెదిరించి నలభై లక్షల రూపాయలను దోచు కెళ్లిన కేసులో భవానీనగర్ పోలీసులు శుక్రవారం నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నింధితుల వద్ద 34,66 000 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను మీర్‌చౌక్ ఏసిపి శ్యామ్ సుందర్ భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ బాల స్వామితో కలిసి విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. బిహార్ రాష్ట్రానికి చెందిన సుల్తాన్ బతుకుదెరువు కోసం హైదరాబాద్‌పాతబస్తీవచ్చి తలాబ్‌కట్టలో స్థిర పడ్డాడు. సుల్తాన్ తలాబ్‌టక్టలో గాజుల వ్యాపారం చేస్తున్నాడు. కాగా గాజుల వ్యాపారి సుల్తాన్ పాతబస్తీలో ఇల్లు ఖరీదు చేయాలని ఉద్దేశ్యంతో బిహార్‌లో ఉన్న భూమిని 40 లక్షల రూపాయలకు విక్రయించాడు. నలభై లక్షల రూపాయలను తలాబ్‌కట్టలోని తానునివాసం ఉంటున్న ఇంట్లోని డ్రమ్‌లో దాచాడు. కాగా సుల్తాన్ ఇల్లు ఖరీదు చేస్తున్న విషయాన్ని బిహార్‌కు చెందిన గాజుల వ్యాపారి తలాబ్‌కట్టలో ఉంటున్న మహ్మద్ జాహిద్‌కు తెలిపాడు. మహ్మద్ జాహిద్ సుల్తాన్ ఇంట్లో ఉన్న డబ్బును దొంగలించాలని పథకం వేశాడు. ఈ విషయాన్ని జాహిద్ తలాబ్‌కట్టకు చెందిన కారు డ్రైవర్ సయ్యద్ ఇక్బాల్ (30)కు తెలిపాడు. గత నెల 30వ తేదీ ఆదివారం ఉదయం ఐదు గంటల సమయంలో సయ్యద్ ఇర్ఫాన్, తలాబ్‌కట్టకు చెందిన రాఫిడ్ డ్రైవర్‌ముదాసీర్ అలాహి (19) కలిసి ముఖాలకు మాస్కులు ధరించి గాజుల వ్యాపారి ఇంటికి వచ్చారు. సుల్తాన్ తులుపులు తీయగానే ఇంట్లోకి ప్రవేశించి గాజుల వ్యాపారి సుల్తాన్ నోరు మూసి వేసి కత్తి పిడితో దాడి చేసి బెదిరించారు. ఇంట్లోని డ్రమ్ములో ఉంచిన నలభై లక్షల రూపాయలను తీసుకుని పారిపోయారు. సయ్యద్ ఇర్ఫాన్, ముధాసీర్ అలాహితో పాటు మహ్మద్ జాహిద్, బండ్లగూడకు చెందిన మహ్మద్ అబ్దుల్ రెహ్మాన్‌లు కలిసి నలభై లక్షల రూపాయలను పంచుకున్నారు. సుల్తాన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేశారు. సుల్తాన్ ఇంట్లోని నలభై లక్షల రూపాయలను దోపిడి చేసినట్లు వారు అంగీకరించారు. సయ్యద్ ఇర్ఫాన్.ముదాసీర్ అలీహి, మహ్మద్ జాహిద్(37), మహ్మద్ అబ్దుల్ రెహ్మాన్ (25)లను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నింధితుల వద్ద నుంచి 34,66000 రూపాయలతో పాటు కత్తి, సెల్ ఫోన్లను పోలీసులు స్వాధీనంచేసుకున్నారు. ఈ కేసును భవానీనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడిస్తున్న మీర్‌చౌక్ ఏసిపి శ్యామ్ సుందర్

### సాయి ఈశ్వర్‌కు నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద

జగద్గిరిగుట్ట, డిసెంబర్ 5, ప్రభాతవార్త బీసీలకు రిజర్వేషన్లల్లో అన్యాయం జరిగిందంటూ తీన్మార్ మల్లన్న కార్యాలయం ముందు జగద్గిరిగుట్ట డివిజన్ బీరప్ప నగర్‌కు చెందిన సాయి ఈశ్వర్ చారి (30) గురువారం ఒంటిపై పెట్రోల్ పోసుకొని కాల్చుకోవడం జరిగింది. వెంటనే అతని గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందిన సాయి ఈశ్వర్ చారిని శుక్రవారం తన స్వస్థలం జగద్గిరిగుట్ట బీరప్ప నగర్‌కు తీసుకురావడంతో టిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద, ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్, మాజీ స్పీకర్ మధుసూదనా చారి మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్ , జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ తన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి సాయి చారి కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతి తెలియజేశారు.

### అయ్యప్ప స్వామి సన్నిధిలో హైదర్‌గూడ స్వాములు



అత్తాపూర్ డిసెంబర్ 5, ప్రభాతవార్త : రాజేంద్రనగర్ సర్కిల్ హైదర్ గూడ నుండి అయ్యప్ప మాల ధరించి 43 రోజుల మండల దీక్ష పూర్తి చేసుకుని ఇరుముడి కట్టుకొని శబరికి బయలుదేరిన గురుస్వాములు కొలన్ వరద రాజు రెడ్డి , సాబాధ విజయ్ కుమార్, పెంటల సుధాకర్ రెడ్డి , కొలన్ జై రాజ్ రెడ్డి, సులిగె దేవేందర్, లక్ష్మణ్‌లు శబరిమలైలో అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆ కలియుగ ప్రత్యక్ష దైవం అయినటువంటి సర్వాపరాధ రక్షకుడైనటువంటి అయ్యప్ప స్వామిని దర్శించుకోవడంతో చాలా సంతోషంగా ఉందని సర్వేజనా సుఖినోభవంతు అని ఈ లోకంలో అందరూ బాగుండాలని మొక్కినట్లు పేర్కొన్నారు.

## వ్యక్తికి గుండెపోటు.. సిపిఆర్ చేసి రక్షించిన ట్రాఫిక్ సిబ్బంది

జీడిమెట్ల, డిసెంబర్ 5, ప్రభాతవార్త జీడిమెట్ల సూరారం సిగ్నల్ వద్ద రహీం అనే వ్యక్తికి గుండెపోటు రావడంతో ఒక్కసారిగా కుప్పకూలాడు. అక్కడే విధులు నిర్వహిస్తున్న జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసు స్టేషన్కు చెందిన ట్రాఫిక్ మార్షల్ శివకుమార్ సీపీఆర్ చేసి రహీం ప్రాణాలను రక్షి ంచారు. అనంతరం తానే స్వయంగా పక్కనే ఉన్న మల్లారెడ్డి ఆసుపత్రికి తరలించారు. సమయానికి స్పందించి సీపీఆర్ చేసిన శివకుమార్‌ను పలువురు అభినందించారు.

### ఆర్టీసీ బస్సులలో చోరీలకు పాల్పడుతున్న ఐదుగురి అరెస్ట్



నిందితులను అరెస్ట్ చేసిన ఉప్పల్ పోలీసులు దృశ్యం.

ఉప్పల్, డిసెంబరు 5 ప్రభాతవార్త : రద్దీగా ఉండే ఆర్టీసీ బస్సులలో చోరీలకు పాల్పడుతున్న ఐదుగురు సభ్యుల ముఠాను ఉప్పల్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. డిఐ వై.రామలింగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హయత్‌నగర్, బంజారా కాలనీకి చెందిన దాసర్ల యాదగిరి (24), చిలుకానగర్ శివాలయం వద్ద ఉండే కొమ్ము ప్రశాంత్ (25), లెప్రసీ కాలనీ, ముత్యాలమ్మ దేవాలయం వద్ద ఉండే పాశం యాదగిరి (23), ఆదర్శనగర్‌లో నివసించే బండారి సాంబరాజు(25), చంద్రపురి కాలనీకి చెందిన మబ్బు రాజు(25)లు ఒక ముఠాగా ఏర్పడ్డారు. నిత్యం ఆర్టీసీ బస్సులలో తిరుగుతూ రద్దీగా ఉండే బస్సులు లక్ష్యంగా చేసుకుని చోరీలు చేస్తున్నట్లు తెలిపారు. ఇదే క్రమంలో గత నెల 2వ తేదీన సికింద్రాబాద్ నుంచి ఉప్పల్‌కు వస్తున్న సేనారామ్ అనే వ్యక్తి బ్యాగ్ జిప్ తొలగించి అందులో ఉన్న ఆరు తులాల బంగారం, 87 తులాల వెండి చోరీ చేసినట్లు తెలిపారు. దీంతో పోలీసులు సిసి కెమెరాల ఆధారంగా విచారణ జరిపి నిందితులను పట్టుకున్నట్లు తెలిపారు. దాసర్ల యాదగిరి, కొమ్ము ప్రశాంత్‌లు గతంలో చోరీ కేసులలో ఉన్నారని, వీరంతా స్నేహితులని తెలిపారు. వీరికి సహకరించిన మరో వ్యక్తి మహ్మద్ సమీర్ పరారీలో ఉన్నాడని తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మహిళలను ఢీకొట్టిన ప్రైవేట్ బస్సు



జీడిమెట్ల, డిసెంబర్ 5, ప్రభాతవార్త దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధి గండి మైసమ్మ సిగ్నల్ వద్ద టూవీలర్‌పై వెళ్తున్న మహిళలను ప్రైవేట్ బస్సు ఢీ కొట్టింది. బస్సు డ్రైవర్ గమనించకుండా అలాగే ముందుకు వెళుతూ ఉండడంతో, సిగ్నల్ వద్ద విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీస్ వెంటనే గమనించి బస్సు ఆపడంతో మహిళ స్వల్ప గాయలతో బయటపడింది. తక్షణమే ట్రాఫిక్ పోలీస్ 108కు ఫోన్ చేసి, గాయపడ్డ మహిళా కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి, మహిళాను ఆసుపత్రికి తరలించారు. ట్రాఫిక్ పోలీస్ పనితీరుపై, స్థానికులు, పలువురు వాహనదారులు అభినందించారు.